
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 9 ఆగస్టు 2024



ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 24.0

కొల్లేరు సరస్సును సందర్శించండి

-7లో

» గవర్నర్‌ను ఆహ్వానించిన ఎమ్మెల్యే కామినేని



కొత్త బస్సులొచ్చాయ్..

ఏలూరు ఆర్టీసీ బస్సు డిపోలో గురువారం విజయవాడ జోన్-2కు సంబంధించి మొత్తం 27 బస్సులను ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్‌లతో కలిసి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు.

7

సొంతగూటికి ఎంపీడీవోలు

» 26 మంది తిరిగి ఉమ్మడి పశ్చిమకు బదిలీ

ఏలూరు సిటీ, ఆగస్టు 8: ఎన్నికల బదిలీల్లో భాగంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాలకు బదిలీపై వెళ్లిన మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు) తిరిగి వారి జిల్లాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి ఎన్నికల సమయంలో 13 మంది తూర్పు గోదావరి జిల్లాకు, 13 మంది కృష్ణా జిల్లాకు బదిలీ పై వెళ్లారు. వారు బదిలీపై వచ్చి గతంలో పనిచేసిన మండలాల్లోనే బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. ఎంపీడీవోలు కె.శ్రీదేవి, జీఏకేఎస్‌వీ జ్యోతిర్మయి, ఎస్.వేణుగోపాలరెడ్డి, ఎస్.వెంకటేశ్వరరావు, జీఆర్ మనోజ్, కె.వాణి, ఎండీ అమిల్ జామ, కె.వెంకటలక్ష్మి, ఎం.మురళీకృష్ణ, సీహెచ్ త్రిశూలపాణి, ఎ.శ్రీనివాస్, కేఆర్‌ఎస్ కృష్ణ ప్రసాద్, టి.సూర్యనారాయణ మూర్తి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై రానున్నారు. ఎన్ఎం గంగాధరరావు, సీహెచ్ పద్మావతి, ఆర్.బేబీ శ్రీలక్ష్మి, పి.శ్రీనివాస్, ఎస్.ఆశీర్వాదం, పి.శామ్యూల్, జి.విజయలక్ష్మి, బీఎస్ఎల్ మంగాకుమారి, ఎం.విశ్వనాథ్, కె.కిరణ్‌కుమార్, జీవీఎస్ రామకృష్ణంరాజు, ఎన్.ప్రేమాన్విత, కుంజా జ్యోతి కృష్ణాజిల్లా నుంచి ఈ జిల్లాకు బదిలీపై రానున్నారు.



కేఆర్ పురం ఐటీడీఏ వద్ద ఆదివాసీ దినోత్సవం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

నేడు ఐటీడీఏలో ఆదివాసీ దినోత్సవం

» ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

బుట్టాయగూడెం, ఆగస్టు 8 : కేఆర్ పురం ఐటీడీఏ కేంద్రంగా శుక్రవారం జరగనున్న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, పీవో జి.శ్రీనుకుమార్ తెలిపారు. ఐటీడీఏ వద్ద వైటీసీ సభాప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే, పీవో పర్యవేక్షించారు. సభికులకు, దినోత్సవానికి వచ్చిన ఆదివాసీ గిరిజనులు, విద్యార్థులు, మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. వర్షం వచ్చినా అంతరాయం కలుగకుండా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని కమిటీ సభ్యు లకు సూచించారు. శుక్ర వారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 2 గంటల వరకు దినోత్సవం కార్యక్రమాలు జరుగుతాయి.

పోలవరం డీఎస్పీగా వెంకటేశ్వరరావు నియామకం

ఏలూరు క్రైం/పోలవరం, ఆగస్టు 8 : పోలవరం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్‌గా ప్రస్తుతం ఇంటెలిజెన్స్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.వెంకటేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలో పనిచేస్తున్న డీఎస్పీలలో 28 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పోలవరం డీఎస్పీగా పని చేస్తున్న ఎన్.సురేష్ కుమార్ రెడ్డిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్టు చేయాలని ఆదేశించింది. గతేడాది పోలవరం డీఎస్పీగా ఈయన బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఇంటెలిజెన్స్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వరరావును పోలవరం డీఎస్పీగా నియమించారు. 1991 ఎస్ఐ బ్యాచ్‌నకు చెందిన ఈయన తడికలపూడి, జంగారెడ్డిగూడెం, ఏలూరు వన్‌టౌన్, ఏలూరు రూరల్, రైల్వే పోలీస్ స్టేషన్, ఇంటెలిజెన్స్‌లో ఎస్ఐగా పనిచేశారు. సీఐగా పదోన్నతి పొంది భీమడోలులో అనంతరం ట్రాన్స్‌కో, ఇంటెలిజెన్స్ విభాగాల్లో పనిచేశారు. డీఎస్పీగా పదోన్నతి పొంది రాజమహేంద్ర వరం ఇంటెలిజెన్స్ డీఎస్పీగా విధులను నిర్వర్తించి మూడేళ్ల క్రితం బదిలీ పై ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఇంటెలిజెన్స్ డీఎస్పీగా నియమించబడ్డారు.



డీఎస్పీ వెంకటేశ్వరరావు

వలంటీర్ల వాట్సాప్ గ్రూపుల తొలగింపు

ఏలూరు రూరల్, ఆగస్టు 8: గ్రామ, వార్డు వలంటీర్లకు (విధుల్లో ఉన్న, రాజీనామా చేసిన, తొలగించిన) సంబంధించి వారి హౌస్‌హోల్డ్స్ పరిధిలో ప్రజలతో ఏర్పాటు చేసుకున్న వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపులు అన్నింటిని వెంటనే తొలగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థకు ఎటువంటి బాధ్యతలను కూటమి ప్రభుత్వం అప్పగించలేదు. ఈ క్రమంలో వలంటీర్లకు సంబంధించిన గ్రూపులను వెంటనే డిలీట్ చేయడంతో పాటు సంబంధిత సమాచారాన్ని వెంటనే అందజేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ సమాచారాన్ని గ్రామ, సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజలకు చేరవేయాలని అందులో పేర్కొన్నారు. గతంలో వలంటీర్ల ద్వారా పెన్షన్లను వైసీపీ ప్రభుత్వం పంపిణీ చేసేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండునెలలకు సంబంధించిన పెన్షన్‌లను వలంటీర్లు లేకుండానే సచివాలయ సిబ్బందితో పాటు ఇతర శాఖలకు సంబంధించిన ఉద్యోగులతో పంపిణీ చేసింది. ఈ నేపథ్యంలో వలంటీర్లకు సంబంధించిన గ్రూపులు తొలగించాలని ఆదేశాలు జారీ అవ్వడంతో వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపులు అన్నింటిని తొలగించారు.

అక్రమార్కులపై.. పిడుగు!



అక్రమార్కులపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పిడుగు పాటైంది. మూడునెలలపాటు అసైన్డ్, 22ఏ భూముల రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. గత ఐదేళ్ల పాటు ఈ భూములకు సంబంధించి లావాదేవీల అసలు రహస్యం బయటకు తీయాలని మరో నిర్ణయం తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా వందలాది ఎకరాలు కొన్నేళ్లుగా కొందరి వశమయ్యాయి. ఫ్రీహోల్డ్‌ను జాగ్రత్తగా తమకు అనుకూలంగా మలచుకుని భూములను రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఇప్పటికే ఈ తరహా భూముల్లో అనేకం చేతులు మారినట్టు సమాచారం. ఇంకొందరు తనఖాలు పెట్టినట్టు చెబుతున్నారు. వీటన్నింటిపైన రాబోయే మూడు నెలల్లోనే పక్కాగా అసలు తేల్చబోతున్నారు.

మూడు నెలల పాటు అసైన్డ్, 22ఏ భూముల రిజిస్ట్రేషన్ నిలుపుదల

- » భూ 'రహస్యం' నిగ్గు తేల్చేలా సర్కారు నిర్ణయం
- » వైసీపీ హయాంలో వేల ఎకరాల్లో సాగిన అక్రమ రిజిస్ట్రేషన్లు
- » వీటన్నింటిపైనా మూడు నెలల్లో విచారణ
- » నిజాలు నిగ్గు తేల్చేలా అధికారులకు సంకేతాలు
- » తాజా మంత్రివర్గ నిర్ణయంతో వైసీపీ అనుకూలురు బెంబేలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఒకటి కాదు రెండు కాదు.. వందల ఎకరాల అసైన్డ్ భూములు.. ఇవికాక మెట్ట ప్రాంత నియోజకవర్గాలన్నింటిలోనూ మరికొన్ని వేలాది ఎకరాల్లో నిషేధిత భూము లు గత ఐదేళ్లల్లో జగన్ ప్రభుత్వ నిర్వాకంతో అత్యధికం ఆ పార్టీ అనుకూలురు పరమయ్యాయి. తొలుత పేదల ఆధీనంలో ఉన్న ఈ భూములు వారికే చెందాలని ఒక నినాదాన్ని అప్పటి వైసీపీ ప్రభుత్వం జనంలోకి ప్రచారం చేసింది. అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యేలు సర్వేయర్లు, ఇతర రెవెన్యూ అధికారుల నుంచి గ్రామాల వారీగా అసైన్డ్‌భూములు, నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలను రప్పించగలిగారు. అప్పటికే ఆయా భూములను ఎవరైనా అనుభవిస్తుంటే నయానో భయానో ఆ వ్యక్తులను కొన్నిచోట్ల తప్పించి, మరికొన్నిచోట్ల బెదిరించి తమ దారికి తెచ్చుకున్నారు. ఇదే తరుణంలో 22ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న భూములను ఎవరైనా తమదేనంటూ రిజిస్ట్రేషన్ చేయించదలచుకుంటే అలాంటి సమస్యల పరిష్కారానికి అప్పటి జిల్లా కలెక్టర్‌కు ప్రత్యేక అధికారాలు ఇచ్చారు. అప్పట్లో ఎవరైనా ప్రతీ సోమవారం జరిగే పరిష్కార వేదికలో ఫిర్యాదులు ఇచ్చినా అవేవీ పెద్దగా పట్టించుకోలేదు. కాని కలెక్టర్లకే నేరుగా సమస్యలు విన్నవించినప్పుడు ఆ భూములపై రాజకీయ ప్రేరేపిత ఒత్తిడి పెరిగినప్పుడు అలవోకగా నిషేధం.. అనే పదం మాయమైంది. ఇలా చింతలపూడి, నూజివీడు, దెందులూరు వంటి నియోజకవర్గాల్లో ఎక్కడికక్కడ తమకు తోచినంత మేర రిజిస్ట్రేషన్లు జరిగేలా జాగ్రత్తలు పడ్డారు. అన్యాక్రాంతమైన భూముల విస్తీర్ణం ఒక అసైన్డ్ భూముల విభాగంలోనే 16 వేలకు పైగా ఉన్నట్టు లెక్క తేల్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ఐదేళ్లల్లో జగన్ పాలనలో ఇష్టారాజ్యంగా జరిగిన భూ ఆక్రమణలు, వాటిపై వచ్చిన ఫిర్యాదులు, అధికారులపై ఒత్తిడి తెచ్చి అసైన్డ్ నిషేధిత భూముల జాబితాను సవరించి ఆ మేర చేసుకున్న రిజిస్ట్రేషన్ల వివరాలను నిగ్గు తేలుస్తామని ప్రకటించింది. తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ భూముల వ్యవహారంపై చర్చకు వచ్చింది. అసలు రహస్యాన్ని అన్ని చోట్ల వెలికితీయాలని నిర్ణయించడమే కాకుండా రాబోయే మూడు నెలల పాటు ఈ తరహా భూముల రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేయాలని ఆదేశించింది. ఈ పరిణామం క్రమంలో ఈ మధ్యన జరిగిన కలెక్టర్ల సమావేశంలోను భూముల ఆక్రమణల విషయం పైనే ప్రధాన చర్చకు వచ్చిన విషయాన్ని కొందరు ప్రస్తావిస్తున్నారు. ఎందుకనంటే జిల్లాస్థాయిలోను ఆఖరుకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థాయిలోను ప్రజల నుంచి వస్తున్న వందలాది ఫిర్యాదుల్లో అత్యధిక భాగం వైసీపీ అనుకూలురు చేసిన దురాక్రమణల మీదే. దీంతో ప్రభుత్వం సీరియస్‌గా ముందుకు కదిలింది. ఈ అంశంలో కలెక్టర్లు మరింత చొరవ తీసుకునే విధంగా అంతర్గత ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. వాస్తవానికి లోగుట్టుగా సాగిన ఈ భూముల వ్యవహారంలో అర్హులైన వారు నష్టపోగా వైసీపీ అనుకూలురే అంతా దక్కించుకున్నట్టయ్యింది.



రాబోయే మూడు నెలల్లో నిజం తేలుతుందా..

గడిచిన రెండేళ్ల పాటు ఏకబిగిన సాగించిన వైసీపీ దుశ్చర్యలను ఎక్కడికక్కడ బయట పడకుండా పలుచోట్ల అయితే అధికారులే కవచంగా మారారు. ఆయా భూములన్నీ ఏనాడో సదరు వ్యక్తికి రిజిస్ట్రేషన్ అయ్యాయని, ఇప్పుడు తామేమి చేయాలంటూ కొందరి అభ్యంతరాలపై తప్పించుకునే ప్రయత్నం చేశారు. సమాచారాన్ని దాచిపెట్టారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరిగిన వ్యవహారం మూడో కంటికి తెలియకుండా పోయింది. పనిలో పనిగా కొందరైతే డబ్బు ఎరచూపి ఇంకొన్నిచోట్ల ఏకపక్షంగా కాసులు వెదజల్లి మరీ పని పూర్తి చేసుకున్నారు. ఇంతలా సాగిన భూదందా వ్యవహారం కూటమి ప్రభుత్వం ప్రకటించినట్టు రానున్న మూడు నెలల్లో పూర్తిగా వెలికి రాగలదా అనేదే ఇప్పుడు అందరిలోనూ సందేహం. కాని గడిచిన రెండు నెలలుగా ఎక్కడికక్కడ కొన్ని విషయాలు బయటపడడం, ఇప్పుడు తీగలాగితే డొంక కదలక మానదని క్షేత్రస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అసలు రహస్యాన్ని ఛేదించక తప్పదని అధికారులు భావిస్తున్నారు.

ప్రత్యేకించి నిషేధిత భూముల జాబితా నుంచి కొన్నింటిని మినహాయించడం లోనూ అప్పటి ప్రభుత్వ పెద్దలు కీలకంగానే వ్యవహరించారు. దీనిని అడ్డుపెట్టుకుని వందల ఎకరాల్లో రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఐదేళ్ల పాటు మిగతా భూముల వ్యవహారమంతా మరుగున పడిపోగా రిజిస్ట్రేషన్ జరిగిన వాటిలో అత్యధిక భాగం ఈ భూములకు చెందినదేనని వాదిస్తున్నవారు లేకపోలేదు. ఎక్కడికక్కడ అప్పటి స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో ఇష్టారాజ్యంగా భూములను కొల్లగొట్టిన వారి వ్యవహారమంతా పక్కాగా బట్టబయలుకావడం ఖాయమని టీడీపీ వర్గీయులు ధీమా వ్యక్తం చేస్తుండగా దీనికి సమాంతరంగా వైసీపీ అనుకూల కబ్జాదారులంతా తమపై పిడుగు పడినట్టుగానే తాజా నిర్ణయాన్ని భావిస్తున్నారు.

తమ్మిలేరు దూకుడు

మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

చింతలపూడి/ముసునూరు/ఏలూరు క్రైం, ఆగస్టు 8 : చింతలపూడి సమీపంలోని నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరద నీరు పెరిగింది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 355 అడుగులు కాగా గురువారం సాయంత్రానికి నీటిమట్టం 349.0 అడుగులకు చేరింది. ఎగువ నుంచి 5,560 క్యూసెక్కు ల వరద నీరు వచ్చి చేరుతోంది. మూడుగేట్ల ద్వారా దిగువకు 8,893 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తూ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. దిగువ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఈ పరమానందం తెలిపారు. కాగా అధిక వర్షాలకు వాగులు పొంగి, రోడ్లు గండ్లు పడుతున్నాయి. గణిజర్ల సమీపంలో పాల వాగు పొంగి రోడ్డు కొట్టుకుపోవడంతో గండిపడి వాగునీరు ప్రవహిస్తోంది. ఎమ్మెల్యే రోషన్‌కుమార్ దృష్టికి తీసుకురాగా అయన ఆదేశాలతో ఎస్ఐ కుటుంబరావు ప్రాంతాన్ని పరిశీలించి గండిని తాత్కాలికంగా పూడ్చించారు. ముసునూరు మండలం బలివే వద్ద తమ్మిలేరు వరద ఉధృతిని నూజివీడు ఇన్‌చార్జ్ ఆర్డీవో భాస్కరరావు గురువారం పరిశీలించారు. పరీవాహక గ్రామాల ప్రజ లను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించా రు. ఎస్ఐ నాగభూషణరావు, ఆర్ఐ దీపిక, వీఆర్వో హరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శనివారపుపేట బ్రిడ్జిపై తమ్మిలేరు వరద


చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంలో ఉన్న తమ్మిలేరు జలాశయానికి తెలంగాణ ప్రాంతం నుంచి వదర నీరు రావడంతో ముందస్తు చర్యల్లో భాగంగా మూడు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ నేపథ్యంలో తమ్మిలేరు జలాశయానికి దిగువ ప్రాంతంగా ఉన్న ఏలూరు నగరానికి వరద నీరు కాల్వల్లో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏలూరు నుంచి శనివారపుపేట, నూజివీడు ప్రాంతాలకు వెళ్లే మార్గానికి నగరంలో రాకపోకలు నిలిచిపోయాయి. శనివారపుపేట లోబ్రిడ్జిపై గురువారం వేకువజామున వరద నీరు రావడంతో త్రీటౌన్ పోలీసులు అప్రమత్తమై రాకపోకలను నిలిపివేసి ముందస్తుగా రెండువైపులా స్టాపర్లను ఏర్పాటు చేసి పోలీస్ పికెట్‌ను నియమించారు. ఏలూరు ఆర్డీవో ఖాజావలి, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ అర్జున్, డిప్యూటీ తహసీల్దార్ గాయిత్రి తమ్మిలేరును పరిశీలించారు. శనివారపుపేట లోబ్రిడ్జిపై వరద నీటి వల్ల వాహనాలు రాకపోకలు నిలిచిపోవడంతో నగరంలో ట్రాఫిక్ అస్తవ్యవస్థంగా మారింది. మరోవైపు ఎక్స్‌కవేటర్‌తో తమ్మిలేరులో అడ్డుపడ్డ గుర్రపుడెక్క, చెత్త, ముళ్ళ పొదలను తొలగించడంతో గంటల తరబడి ట్రాఫిక్‌నకు అంతరాయం ఏర్పడింది. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేయడానికి కృషి చేశారు. గురువారం రాత్రి కూడా సీఆర్‌ఆర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ జామ్ అవుతూనే ఉంది. మరోవైపు తంగెళ్ళమూడి బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరదను చూడడానికి ప్రజలు తరలి రావడంతో టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు అక్కడ గస్తీని నిర్వహిస్తున్నాయి. పడమర లాకుల నుంచి ఎవ్వరు వెళ్ళకుండా ముళ్ళ కంచెలను వేసినా వాటిని తొక్కుకుంటూ వెళ్తున్నారు. సీఆర్‌ఆర్ కాలేజీ వద్ద ఉన్న లోబ్రిడ్జిని మూసివేశారు. మార్కెట్‌యార్డుకు వెళ్ళే మార్గంలో బ్రిడ్జి వద్ద ప్రజలు ఎవ్వరు కాల్వ చూడడానికి రాకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.



ఏలూరు నగరంలోని శనివారపుపేట కాజ్‌వే పై నుంచి ప్రవహిస్తున్న తమ్మిలేరు



నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న వరద నీరు



ఏలూరు పడమర లాకుల వద్ద తమ్మిలేరు ఉధృతి



సీఆర్ రెడ్డి కాలేజ్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

1833 ఎస్ఎంసీలకు ఎన్నికలు ప్రశాంతం

» కోరంలేని కారణంగా ఐదుచోట్ల నిలిపివేత

ఏలూరు అర్బన్, ఆగస్టు 8 : మెజార్టీ పాఠశాలల్లో ముందస్తుగా రాసుకున్న జాబితాల మేరకే ఆయా పదవులకు ఫలానా వారుండాలనే షరతుల మధ్య గురువారం పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ)ల ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 1846 ఎస్ఎంసీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, 1833 కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలు జరిగిన ఎస్ఎంసీల్లో 1,386 ప్రాథమిక, 191 ప్రాథమికోన్నత, 256 ఉన్నత పాఠశాలలున్నాయి. ఇక జీరో ఎన్‌రోల్‌మెంట్ కారణంతో 8 ప్రాథమిక పాఠశాలలకు, కోరంలేని కారణంపై మరో 5 పాఠశాలల ఎస్ఎంసీలకు ఎన్నికలు జరుగలేదు. ఇలా కోరంలేని కారణంగా ఎన్నికలు నిలిచిపోయిన పాఠశాలల్లో అడవినెక్కలం (అగిరిపల్లి మండలం), పూళ్ళ (భీమడోలు), పెదలంక (కలిదిండి) జడ్పీ హైస్కూళ్ళు, పోతనపల్లి (చాట్రాయి) ఎంపీయూపీ పాఠశాల, అరుంధతీపేట (జంగారెడ్డిగూడెం) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉన్నాయి. ఎన్నికలు నిలిచి పోయిన పాఠశాలలకు ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసిన తర్వాత మరోదఫా నిర్వహిస్తారు. జిల్లావ్యాప్తంగా అన్ని చోట్ల ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని, ముఖ్యంగా సమస్యాత్మక పాఠశాలలుగా గుర్తించిన 37చోట్ల కూడా ప్రశాంతంగా ముగిశాయని డీఈవో అబ్రహం తెలిపారు. కమిటీలకు ఎన్నికైనవారికి వారి బాధ్యతలు, పాఠశాలలకు ప్రభుత్వం నుంచి వివిధ రూపాల్లో విడుదల చేసే గ్రాంట్లు, వాటి వినియోగం నియమ నిబంధనలపై త్వరలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కాగా జిల్లాలో పలుచోట్ల స్థానిక ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే జరిగాయి. కేవలం అనుకూలురు లేనిచోట 'కోరం' సాకుతో ఎన్నికలను వాయిదా వేయించారన్న ప్రచారం జరుగుతోంది. ఆయా వర్గాల వారీగా పదవులకు ఎవరెవరుండాలనే దానిపై ముందుగానే స్పష్టతనిచ్చారు. దీంతో దాదాపు ఎక్కడా పోటీకి తావులేకుండా ఎన్నికలు ముగిశాయి. అయితే ఈ వాదనలను జిల్లావిద్యాశాఖ ఖండిస్తోంది. ఎన్నికల నిర్వహణలో రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్‌శాఖలు జిల్లా విద్యాశాఖకు సహకరించాయి.



పోలవరం మండలం దొండపూడి-సాగిపాడు కల్వర్టుపై వరద ఉధృతి

ఏజెన్సీలో పొంగుతున్న వాగులు

ఏలూరుసిటీ/ బుట్టాయగూడెం/పోలవరం/జంగారెడ్డిగూడెం, ఆగస్టు 8 : నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో గురువారం భారీగానే వర్షాలు కురిశాయి. ఏజెన్సీ ప్రాంతంలో మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాల కారణంగా కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. గడచిన 24 గంటల్లో పోలవరం మండలంలో 115.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 39 మి.మీ నమోదైంది. వేలేరుపాడు 103, కుక్కునూరు 83, జీలుగుమిల్లి 73.6, టి.నరసాపురం 70.2, బుట్టాయిగూడెం 66.6, జంగారెడ్డిగూడెం 65.6, చింతలపూడి 61, కొయ్యలగూడెం 56.4, కామవరపుకోట 49.2, పెదవేగి 44, ద్వారకా తిరుమల 43, లింగపాలెం 38.2, చాట్రాయి 36.4, భీమడోలు 31.8, నిడమర్రు 23, ఉంగుటూరు 22.8, నూజివీడు 18.6, దెందులూరు 18.2, ఆగిరిపల్లి 15.4, ముసునూరు 12.2, ముదినేపల్లి 10.2, మండవల్లి 8.6, ఏలూరు అర్బన్ 8.4, ఏలూరు రూరల్ 5.8, పెదపాడు 5.8, కలిదిండి 3.4, కైకలూరు 2.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

బుట్టాయగూడెం మండలం కేఆర్ పురం తూర్పు, పడమర కాల్వలు గురువారం పొంగి ప్రమాదకరస్థాయిలో ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కుండపోత వర్షాలు కారణంగా విద్యుత్ సరఫరా లేక మారుమూల ప్రాంతాల్లోని ఆదివాసీలు అంధకారంలో మగ్గుతున్నారు. పోలవరం మండలంలో నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పోలవరం, పట్టిసీమ, గూటాల, కొత్తపట్టిసీమ, ఇటుకలకోట, వింజరం, చేగొండపల్లి తదితర గ్రామాలు జలమయమయ్యాయి. ఎల్ఎన్‌డీ పేటలో కొండవాగుల వరద జలాల ఉధృతికి 30 ఎకరాల వరిపంట నీటమునిగింది. ఎల్ఎన్‌డీపేట కొవ్వాడ రిజర్వాయర్ కొండవాగుల వరద జలాలతో నిండి గురువారం ఉద యం రిజర్వాయర్ నీటిమట్టం 90.25 మీటర్లకు చేరుకోవడంతో ఉన్నతాధికా రులు ఆదేశాల మేరకు సిబ్బంది 1000 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేశారు. పోలవరం నుంచి కన్నాపురం వెళ్ళే రోడ్డు మార్గంలో దొండపూడి సాగిపాడు కల్వర్టుపై 4 అడుగుల ఎత్తున వరద జలాలు ప్రవహిస్తుండడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొండవాగుల ఉధృతికి పోలవరం నుంచి గుంజవరం మీదుగా రేపల్లెవాడ వెళ్ళే మార్గంలో గుంజవరం వద్ద ఉన్న కల్వర్టు, చేగొండపల్లి రేపల్లెవాడ కల్వర్టు లపై వరద జలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పోలవరంలో కొండవాగుల జలాలు కడెమ్మ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరి లోకి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జంగా రెడ్డి గూడెం మండలంలోని కొంగువారిగూడెం ఎర్రకాల్వ జలాశయానికి గురువారం 5,347 క్యూసె క్కుల వరద నీరు చేరుతుండగా 6,252 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.ప్రాజెక్టు నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 82.30 మీటర్లకు ఉందని డీఈ రాంబాబు తెలిపారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న కేఆర్‌పురం తూర్పు కాల్వ



రూ.2 లకే బిర్యానీ ప్యాకెట్

మీరు విన్నది నిజమే.. రూ. 2 లకే బిర్యానీ ఇచ్చారు..తాడేపల్లిగూడెంలో ఓ హోటల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ ఆఫర్ ప్రకటించారు. ఇక జనం ఒక్కసారిగా హోటల్ ముందు బారులు తీరారు. దీంతో మెయిన్ రోడ్డు స్తంభించింది. హోటల్ ప్రచారం కోసమని నిర్వాహకులు 200 పొట్లాలు సిద్ధం చేయగా రెండు వేల మంది వరకూ ఈ ఆఫర్ కోసం ఎగబడ్డారు. దీంతో అక్కడ ట్రాఫిక్ జామ్ అయింది. పరిస్థితి చక్కదిద్దేందుకు పోలీసులు చెమటోడ్చాల్సి వచ్చింది.

- తాడేపల్లిగూడెం రూరల్




మాధవరం వద్ద వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాలువ

ఉధృతంగా ఎర్రకాల్వ

ఎర్రకాలువ వరద ఉధృతి రోజు రోజుకు పెరుగుతోంది. నిన్నటి వరకూ కాలిబాట వంతెనను తాకుతూ వెళ్లిన ఎర్రకాల్వ గురువారం నాలుగు అడుగులు పెరిగి ప్రవహిస్తోంది. వరద నీరు నిన్నటి వరకూ తగ్గినట్టే కనిపించినా మాధవరం, జగన్నాధపురం, మారంపల్లి, నందమూరు, ఆరుళ్ల పంట చేలకు వరదనీరు ఎగపొడుస్తోంది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

- తాడేపల్లిగూడెం రూరల్



సర్దుపోటు

తలనొప్పిగా మారిన టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్

- అధికారులకు సిఫారసుల ఒత్తుళ్లు
- 'సెలవు' దిశగా విద్యాధికారుల యోచన
- నేడే మండల స్థాయిలో సర్‌ప్లస్ టీచర్లకు కౌన్సెలింగ్
- మార్గదర్శకాలను సవరించాలని ఉపాధ్యాయ సంఘాల వినతి

ఏలూరు అర్బన్, ఆగస్టు 8 : టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ (పని సర్దుబాటు) విద్యాశాఖకు కత్తిమీద సాములా తయారైంది. జిల్లా విద్యాశాఖతో ప్రమేయం లేకుండా తమవద్దవున్న స్కూల్ యూడైస్ డేటా, టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టిస్) డేటాలను అనుసంధానం చేసుకుని ఈ నెల 7వతేదీ నాటి స్టూడెంట్, టీచర్ నిష్పత్తి ప్రకారం నేరుగా రాష్ట్రస్థాయి నుంచే వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను ఈ దఫా చేస్తున్నప్పటికీ జిల్లాలో విద్యాధికారులపై పలువురు ప్రజా ప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు తప్పడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయుల బదిలీలు కౌన్సెలింగ్‌తో నిమిత్తం లేకుండా పలువురికి దొడ్డిదారిన జరిగిన విషయం తెలిసిందే. స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా విద్యాధికారులపైన, రాష్ట్రస్థాయిలో విద్యాశాఖ ఉన్నతాధికారులపైన ఒత్తిళ్లు తెచ్చిమరీ డిప్యూటేషన్లు, క్లియర్ వేకెన్సీలకు బదిలీ ఉత్తర్వులు తెచ్చుకోవడం కొన్నేళ్లపాటు వివాదాస్పదమైంది. ఇలా ఒత్తిళ్లతో బదిలీలు చేయించుకోవడం వల్ల సంబంధిత టీచర్లకు ఒకింత వెసులుబాటు ఉండవచ్చుగాని క్షేత్ర స్థాయిలో అనేక పాఠశాలల్లో మరీ ముఖ్యంగా మారుమూల గ్రామాలు, ప్రాంతాల్లో ఆయా సబ్జెక్టుల బోధనకు అసలు టీచర్లేలేని పరిస్థితులు తలె త్తాయి. ఈ నేపథ్యంలో ఇటీవలే అధికార పగ్గాలను చేపట్టిన కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించడానికి పార దర్శకతతో కూడిన వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను చేపట్టింది. దీనికనుగుణంగానే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆయా సబ్జెక్టుల్లో పీజీ విద్యార్హతలున్న ఎస్జీటీలను సైతం హైస్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్లుగా నియమించడం ద్వారా ఉపాధ్యాయుల కొరత అనేదే లేకుండా చర్యలు చేపట్టింది. అయితే నూతన విధానంలోనూ జిల్లా విద్యాధికారులపై ఒత్తిళ్లు తప్పడం లేదని సమాచారం. తాత్కాలిక ప్రాతిపదికన కొరతవున్న పాఠశాలలకు సర్‌ప్లస్ టీచర్లను వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై పారదర్శకంగా కౌన్సెలింగ్ ప్రాతిపదికన నియమించడానికి విద్యాశాఖ కార్యాచరణ చేపట్టింది. కాగా 'తమ వాళ్లను' ఫలానా ప్రాంతంలోని పాఠశాలలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద నియమిం చాల్సిందేనంటూ పలువురు ప్రజాప్రతినిధులు సిఫారసు లేఖలతోను, ఫోన్‌ల ద్వారా విద్యాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. ఇటువంటి సిఫార సులను అంగీకరించడం లేదా అమలు చేయడం కూటమి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం అసాధ్యమని విద్యాధికారులు స్పష్టం చేస్తున్నప్పటికీ ఎలాగైనా చేయాల్సిందేనని పట్టుబడుతున్నట్టు సమాచారం. ఒక్కో ప్రజాప్రతినిధి నుంచి పదుల సంఖ్యలో వస్తోన్న సిఫారసులను అమలు చేయడం సాధ్యం కాదని నచ్చజెప్పేకంటే కొద్దిరోజులపాటు 'సెలవు'పై వెళ్లిపోవడమే బెటరని విద్యాధికారులు భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. సిఫారసులను అమలు చేయాల్సి వస్తే కనిష్టంగా వంద కిలోమీటర్ల నుంచి గరిష్టంగా 180 కిలోమీటర్ల వరకు దూరంలోని ప్రస్తుత పాఠశాల నుంచి వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద నియమించాల్సి వస్తుందని ప్రభుత్వ మార్గదర్శకాలకు పూర్తిగా విరుద్ధమని చెబుతున్నారు.

వేగం పెంచిన విద్యాశాఖ

ఈ నెల 11 నాటికల్లా టీచర్ల పనిసర్దుబాటు ప్రక్రియను పూర్తిచేసి, ఆయా స్థానాలకు తాత్కాలికంగా నియమితులైన ఉపాధ్యాయులంతా 12న విధులు చేపట్టేలా విద్యాశాఖ కసరత్తుని మరింత వేగవంతం చేసింది. ఇందులో భాగంగా గురువారం జిల్లాలో పలు పాఠశాలల యూడైస్ కోడ్‌లను సేకరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో సర్‌ప్లస్ టీచర్లు, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌లపై వివరాలను ఎప్పటికప్పుడు తీసుకుంది. తాజాగా సవరించిన షెడ్యూల్ ప్రకారం శుక్రవారం మధ్యాహ్నానికల్లా అన్ని మండలాల ఎంఈవోలకు పాఠశాలల వారీగా సర్‌ప్లస్, డెఫిసిట్ టీచర్ల వివరాలతో కూడిన వేర్వేరు జాబితాలను ఆన్‌లైన్‌ద్వారా నేరుగా పంపించనున్నారు. ఆ వెంటనే సాయంత్రం నుంచి ఎంత ఆలస్యమైనా మండల స్థాయిలో సర్‌ప్లస్ టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. మండల స్థాయిలో సర్దుబాటు అనంతరం ఇంకా మిగిలిపోయిన సర్‌ప్లస్ ఉపాధ్యాయులకు శనివారం డివిజన్ స్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ దఫా వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ మొత్తాన్ని జిల్లా విద్యా శాఖ ప్రమేయం లేకుండా రాష్ట్రస్థాయి నుంచే పర్యవేక్షిస్తుండటంతో పాటు,తుది ఆర్డర్లను కూడా జారీ చేస్తున్నారు. ఆ మేరకు గుర్తించిన మిగులు (సర్‌ప్లస్) టీచర్ల నుంచి డేట్ ఆఫ్ జాయినింగ్ (కేడర్‌లో)ను ప్రామాణికంగా తీసుకుని పాఠశాలల వారీగా జూనియర్లను ఆయా సబ్జెక్టుల నుంచి కొరతవున్న పాఠ శాలలకు కౌన్సెలింగ్ ద్వారా నియమించనున్నారు. సవరించిన గణాంకాల అనంతరం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 760 మంది ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్ జాబితాలో ఉండగా, ఆయా సబ్జెక్టుల్లో 536 పోస్టులకు పాఠశాలల్లో టీచర్ల కొరత ఉంది. తుది గణాంకాల్లో ఈ సంఖ్యల్లో కొద్దిపాటి మార్పులు ఉండొచ్చు. మొత్తం మీద 'పని సర్దుబాటు' కేడర్ సీనియార్టీ ప్రకారం జూనియర్లకే వర్తింపజేస్తున్నప్పటికీ, ఉమ్మడి జిల్లాలో కొరతవున్న సబ్జెక్టు పోస్టుల సంఖ్య తక్కువగా ఉండటంతో కౌన్సెలింగ్ జాబితాల్లో చివరన వున్న జూనియర్లు ఎక్కడివారక్కడే ఉంటారని చెప్పవచ్చు.

ఏలూరు కార్పొరేషన్ టీచర్లకు సంకటస్థితి !

మున్సిపల్ టీచర్లను పాఠశాల విద్యాశాఖలోకి విలీనం చేసిన విషయం తెలిసిందే. ఆ ప్రకారం పంచాయితీరాజ్, మున్సిపల్ టీచర్లు ఏకమైన నేపథ్యంలో ఇపుడు చేపడుతున్న వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో ఏలూరు నగరపాలక సంస్థ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో సర్‌ప్లస్‌గా గుర్తించిన వారిని కొరతవున్న పాఠశాలలకు సర్దుబాటు చేయడం ఒకింత ఇబ్బంది కరమేనని విద్యాధికారులు అంచనా వేస్తున్నారు. ఏలూరు కార్పొరేషన్ పాఠ శాలల్లో సుమారు 160 మందికిపైగా ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులు సర్‌ప్లస్‌గా ఉండగా, కేవలం హైస్కూళ్లలో మాత్రం 20 పోస్టులకు మాత్రమే కొరత ఉందని సమాచారం. ఇలా కొరతవున్న హైస్కూళ్లకు సర్దుబాటు చేసినా మిగిలిపోయిన ఎస్జీటీలను ఏలూరు మండల పరిధిలోని పాఠ శాలలకు అడ్జస్ట్ చేయడానికి కూడా ఎక్కడా నీడ్ కనిపించడం లేదు. ఇక మిగిలిపోయిన సర్‌ప్లస్ టీచర్లను డివిజన్ పరిధిలో డీవైఈవో పూల్‌లోకి చేర్చి కొరతవున్న పాఠశాలలకు నియమించడానికి సాంకేతికపరమైన సమస్యలు వస్తాయని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ఒకవేళ డివిజన్ పరిధిలోని పాఠశాలలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద నియమిస్తే వ్యతిరేకిస్తూ పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశాలు లేకపోలేదని విద్యాశాఖ భావిస్తోంది.



ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులతో డీఈవో సమావేశం

ఉమ్మడి జిల్లాలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ అమలుపై గురువారం సాయంత్రం అన్ని ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులతో డీఈవో అబ్రహం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. పని సర్దుబాటుకు సహక రించాలని కోరారు. సర్దుబాటుకు ప్రామాణికతపై కొందరు నాయకులు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. సర్‌ప్లస్ టీచరు మండలస్థాయి కౌన్సెలింగ్‌లో వూకెన్సీని కోరుకునేటపుడు ప్రస్తుత పాఠశాలలో చేరిన తేదీని ప్రామాణికంగా తీసుకుంటుండగా, అదే డివిజన్ స్థాయికి వచ్చేసరికి మాత్రం కేడర్‌ను ప్రామాణికంగా ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ఇప్పటికీ పలు వురు టీచర్లు 'టిస్'లో డేటాను అప్‌డేట్ చేసుకోలేదని ఇవన్నీ పూర్తి కాకుండానే వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేపట్టడం సమంజసం కాదన్నారు. అయితే ఈ విషయాలన్నీ రాష్ట్రస్థాయిలోనే పరిష్కరించుకోవాలని, జిల్లాస్థాయిలో తామేమీ చేయలేమని డీఈవో తేల్చిచెప్పారు.



మంత్రికి వినతిపత్రితం అందజేస్తోన్న 'అపుస్మా' నాయకులు

రోడ్ ట్యాక్స్ తగ్గింపునకు మంత్రికి 'అపుస్మా' వినతి

ఏలూరు అర్బన్, ఆగస్టు 8 : ప్రైవేటు విద్యాసంస్థల బస్సులపై గత వైసీపీ ప్రభుత్వం 300 శాతం మేర పెంచిన రోడ్డుపన్నును తగ్గించాలని మంత్రిని కోరారు.

గురువారం ఏలూరు విచ్చేసిన రవాణాశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డిని ఏపీ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (అపుస్మా) నాయకులు డాక్టర్ ఎం.బి.ఎస్.శర్మ, కె.విజయలక్ష్మి, కె.చంద్రశేఖరరావు,ప్రసాద్, వినోద్, ఎస్.సతీష్, రాణా తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఏ రాష్ట్రంలోనూ రోడ్డు ట్యాక్స్‌ను ఒకేసారి ఇంతభారీగా పెంచలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రితో పాటు అక్కడే వున్న ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్‌లకు కూడా అభ్యర్థనలను అందజేశారు. తమ వినతిపై స్పందించిన మంత్రి ఈ సమస్యను ఉన్నతాధికారుల పరిశీలనకు వెంటనే పంపాలని ఆదేశించారని 'అపుస్మా' నాయకులు తెలిపారు.

పోలవరం నిర్వాసితులను ఆదుకోండి : ఎంపీ మహేష్

ఏలూరు టూటౌన్, ఆగస్టు 8: పోలవరం నిర్వాసితులు లక్షా 20 వేల మందికి న్యాయం చేయాలని, పామాయిల్ రైతులకు ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని పార్లమెంట్‌లో ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో మహేష్ మాట్లాడారు. రాష్ట్రంలో 26 జిల్లాలకు 7 ఇంక్యుబేషన్ సెంటర్లు మాత్రమే ఉన్నాయన్నారు. జిల్లాలో లక్షమంది పామాయిల్ రైతులున్నారని అన్నారు. ఏలూరులో వ్యవసాయ పరిశోధన ప్రోసెసింగ్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని పరిశ్రమల శాఖ మంత్రి జితిన్‌రామ్‌ను కోరారు. పోలవరం నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

జడ్పీ ఛాంబర్ నూతన కార్యవర్గం ఎంపిక

ఏలూరుసిటీ, ఆగస్టు 8: జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన ఏలూరు జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గల జడ్పీటీసీ సభ్యులతో ఛాంబర్ నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జడ్పీటీసీ ఛాంబర్ అధ్యక్షులుగా పోలనాటి శ్రీనివాసరావు (బాబ్జి), ఉపాధ్యక్షులుగా కోరిపల్లి జయలక్ష్మి, సెక్రటరీగా బొక్కా రాధాకృష్ణ, జాయింట్ సెక్రటరీగా మోలుగుమాటి నీరజ, ట్రెజరర్‌గా కొయ్యే సూర్యారావు, కార్యవర్గ సభ్యులుగా జి.రామలక్ష్మి, ఆర్.కనకదుర్గ, సీహెచ్ శ్యామ్యూల్, వసంత రావులను ఎన్నుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.అనంతరం జడ్పీటీసీ సభ్యులతో ఛైర్‌పర్సన్ సమావేశం నిర్వహించారు.



పరీక్షలను పరిశీలిస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్

ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం పరీక్షలు

ఏలూరు క్రైం, ఆగస్టు 8 :ఏలూరులో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫైనల్ ఎగ్జామ్స్ ఈనెల 6వ తేదీన ప్రారంభమయ్యాయి. అనాటమి పేపర్-2 పరీక్ష గురువారం నిర్వహించారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో గత ఏడాది 150 మంది విద్యార్థులు ఎంబీబీఎస్‌లో అడ్మిషన్లు పొందారు. వీరందరూ ఏడాది పాటు అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ సబ్జెక్టులపై విద్యనభ్యసించారు. ఫైనల్ ఎగ్జామ్స్ ఈనెల 6వ తేదీ నుంచి రోజు విడిచి రోజు ఈనెల 16 వరకూ జరుగనున్నాయి. ఒకొక్క సబ్జెక్టుకు రెండు పేపర్లు రాయనున్నారు.ఈనెల 19 నుంచి 24 వరకూ ప్రాక్టికల్స్ జరుగుతాయి. పరీక్షను మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్ పరిశీలించారు.

కార్మికుల సంక్షేమం..ప్రయాణికుల క్షేమం ముఖ్యం

ఆర్టీసీకి కొత్త బస్సులు

ప్రారంభించిన రవాణా మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ఏలూరు క్రైం, ఆగస్టు 8 : రాష్ట్రంలో ఆర్టీసీకి 1400 కొత్త బస్సులు కొనుగోలు చేశామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఏలూరు ఆర్టీసీ బస్సు డిపోలో గురువారం విజయవాడ జోన్-2కు సంబంధించిన స్టార్ లైనర్, సూపర్ లగ్జరీ, ఆల్ట్రా డీలక్స్ మొత్తం 27 బస్సులను ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తామని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తామన్నారు. కార్మికుల సంక్షేమంతో పాటు ప్రయాణికుల క్షేమం తమకు ముఖ్యమన్నారు. గత ప్రభుత్వం గత ఐదేళ్లలో ఆర్టీసీకి ఒక్క బస్సును కూడా కొనుగోలు చేయలేదన్నారు. ప్రయాణికుల భద్రతకు, సుఖవంతమైన ప్రయాణానికి ప్రాధాన్యం ఇచ్చి కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు మేరకు పని చేస్తోందన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి రాష్ట్రంలో మొదటి దశలో 100 అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తున్నామన్నారు. తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని ఆర్టీసీ కార్మికుల సమస్యలపై సాను కూలంగా స్పందించి పరిష్కరించదగిన వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరి స్తామన్నారు. కార్మికులు, ఉద్యోగులు సంతోషంగా ఉంటేనే వారు మెరుగైన సేవలు అందిస్తారన్నారు. తాను నెలలో 15 రోజుల పాటు ప్రత్యేక సమయం కేటాయిం చుకుని ఆర్టీసీ డిపోల్లో సమస్యలు పరిష్కార దిశగా పనిచేస్తున్నానన్నారు.ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి, ఉప రవాణా కమిషనర్ శాంతకుమారి, ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కె ఖాజావలి, ఏలూరు, తూర్పు గోదావరి, కాకినాడ, కృష్ణా జిల్లాల ప్రజా రవాణాధికారులు ఎన్‌వీఆర్ వరప్రసాద్, షర్మిల, శ్రీనివాసరావు, వాణి, ఏలూరు డిపో మేనేజర్ వాణి, ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాలు వినతి పత్రాలను మంత్రికి అందజేశారు. వాటన్నింటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి ప్రారంభించిన బస్సులు ఏలూరు డిపో నుంచి పాత బస్టాండ్ వరకూ వెళ్లి తిరిగి వచ్చాయి. వివిధ డిపోలకు కేటాయించిన బస్సులు ఆయా ప్రాంతాలకు వెళ్లిపోయాయి.



ఏలూరులో బస్సులకు పూజలు చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

ఆలస్యమైనా ఫర్వాలేదు..సురక్షితంగా చేర్చండి

డ్రైవర్లతో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

ఆర్టీసి కార్మికులు డ్రైవింగ్‌లో తొందరపాటు తనం వద్దని ఆలస్యమైనా ఫర్వాలేదని ప్రయాణీకులను మాత్రం సురక్షితంగా గమ్యాలకు చేర్చాలని విజయవాడ రీజినల్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి అన్నారు. ఏలూరు ఆర్టీసీ డిపోలో నూతనంగా బస్సులను ప్రారంభించిన సందర్భంగా ముందుగా ఆ బస్సు డ్రైవర్లతో ఆయన సమావేశం అయ్యారు. జాతీయ రహదారులపై తరచుగా ఆగి ఉన్న వాహనాలను ఢీకొట్టడమో లేదా ముందు వెళ్తున్న వాహనం అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ఆ వాహనాన్ని ఢీకొనడం జరుగుతోందని వాహన వేగాన్ని బట్టి కొంత దూరం మెయింటైన్ చేయాలని సూచించారు. కొండ ప్రాంతాల్లో వెళ్ళేవారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, మలుపుల్లో ఎంతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మైలేజీ పెంచే దిశగా కార్మికులు తమ నైపు ణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు.ఇచ్చిన సమయం అయిపోతుందని తొందరపాటు తనంతో డ్రైవింగ్ చేయవద్దని ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు చేర్చడమే మన అందరి బాధ్యత అని సూచించారు. వాహనం ఎక్కే ముందు ఖచ్చితంగా అన్ని టైర్లను పరిశీలించుకోవాలని, బ్రేక్, హారన్, లైట్లు అన్ని చూసుకున్న తరువాతే వెళ్లాలన్నారు. ఆయనతో పాటు వివిధ జిల్లాల రీజినల్ మేనేజర్లు, డిపో మేనేజర్లు ఉన్నారు.



ఘనంగా పైడితల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

కాళ్ళ, ఆగస్టు 8 : పైడితల్లి అమ్మవారి నామస్మరణతో జువ్వలపాలెం గ్రామం మారుమోగింది. కాళ్ళ మండలం జువ్వలపాలెం గ్రామంలోని తూర్పుపేటలో భక్తులు, దాతలు, గ్రామ ప్రజలు సహాయ సహకారాలతో నూతనంగా నిర్మించిన గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయంలో విగ్రహం, ఆలయ శిఖర, జీవధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు పుల్లేటికుర్తి గణపతిశర్మ బ్రహ్మత్వంలో గురువారం ఉదయం 9:30 నిమిషాలకు వేదమంత్రాల నడుమ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.నర్సాపురం పార్లమెంట్ మాజీ సభ్యుడు గోకరాజు గంగరాజు, టీడీపీ బోర్డు మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, జనసేన నాయకుడు చెనమల్ల చంద్రశేఖర్‌తో పాటు పలువురు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు.

కొల్లేరు సరస్సును సందర్శించండి


గవర్నర్‌ను ఆహ్వానించిన ఎమ్మెల్యే కామినేని



కైకలూరు, ఆగస్టు 8: కొల్లేరు సరస్సులోని పక్షుల కేంద్రాన్ని సందర్శించాలని రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానించినట్లు కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. అమరావతిలో గురువారం గవర్నర్‌ను కలసి ఆహ్వానించారు. ఈ నెల 17న నెల్లూరు స్వర్ణభారతీ ట్రస్ట్ 23వ వార్షికోత్సవంలో కూడా పాల్గొనాలని ఆహ్వానించారు. స్వర్ణభారతీ ట్రస్ట్ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధనకర్ కూడా హాజరవుతారని తెలిపారు.

గ్యాస్ లీక్ ప్రమాదం

చికిత్స పొందుతూ భార్యాభర్తల మృతి



చనిపోయిన మురళీ, కుమారి (ఫైల్ ఫొటో)

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 8: గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవించడంతో గాయాలపాలైన కుటుంబం తాడేపల్లిగూడెం ఏరియా ఆసు పత్రిలో చికిత్స పొందుతున్నారు. భార్య, భర్తలు గురువారం మృతి చెందారు. తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలోని టిడ్కో ఇళ్ల వద్ద మంగళవారం ఉదయం గ్యాస్ బండ పేలిన ఘటనలో భార్య భర్తలు బోడపాడు మురళి (37), బోడపాడు కుమారి (34), కుమార్తె నీలిమలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో వారిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ మురళి, కుమారిలు గురువారం మృతి చెందారు. నీలిమకు చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రమేష్ వివరించారు.

క్రైం కార్నర్

మంచిలి వద్ద బైక్‌పై వచ్చి చైన్ స్నాచింగ్

రూ.4.75 లక్షలు విలువ చేసే బంగారు వస్తువులు చోరీ

అత్తిలి, ఆగస్టు 8 : మహిళ మెడలో నుంచి నాలుగు లక్షల 75 వేల రూపాయల విలువ చేసే 25 కాసుల బంగారాన్ని దొంగిలించుకుపోయినట్లు అత్తిలి ఎస్ఐ రాంబాబు తెలిపారు. బుధవారం రాత్రి ఇరగవరం మండలం కె.ఇల్లింద్రపర్రు గ్రామానికి చెందిన పేరుమళ్ళ శ్రీరామూర్తి వేల్పూరు గ్రామంలో ఉంటున్న అక్క అయిన పచ్చిపులుసు లక్ష్మిని మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని పాలకోడేరు మండలం కోరుకొల్లు గ్రామంలో తన మేనల్లుడి పెళ్లి చూపులకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా రాత్రి 8 గంటల సమయంలో పంచమర్రు గ్రామం దాటిన తరువాత మంచిలి డంపింగ్ యార్డుకు వచ్చేసరికి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి లక్ష్మీ మెడలో నుంచి బంగారపు గొలుసు లాగేందుకు ప్రయత్నించగా ఆమె భయంతో కిందకు పడిపోయింది. మోటారు సైకిల్‌పై నుంచి ఒక వ్యక్తి వచ్చి మెడలో 8 కాసులు బంగారు తాడు, 4 కాసుల నల్లపూసల తాడు, ఏడు కాసుల చంద్రహారం,ఆరు కాసుల బంగారు ముత్యాల దండ దొంగిలించుకుపోయారు.ఆమె కిందపడడంతో తలకు గాయమైంది. శ్రీరామ్మూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

మహిళ మెడలో బంగారం చోరీ

యలమంచిలి, ఆగస్టు 8: అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి దేవి మెడలో ఉన్న బంగారు నల్లపూసల తాడును ఇద్దరు ఆగంతుకులు లాక్కుని పరారయ్యారని ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. పెద్దిరెడ్డి దేవి, ఆమె భర్త సుబ్బారావులు ఇరువురు గురువారం పాలకొల్లులో ఫంక్షన్‌కు హాజరై మోటార్‌సైకిల్‌పై స్వగ్రామానికి తిరిగి వెళుతున్నారు. కాజ గ్రామపరిధిలోని జాతీయ రహదారిపై వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వెనుక నుంచి వచ్చి దేవి మెడలో ఉన్న నల్లపూసల చైన్ లాక్కుని పరారయ్యారు. దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

యలమంచిలి, ఆగస్టు 8: మండలంలోని గంగడపాలెం గ్రామానికి చెందిన పెమ్మాడి సైదులుస్వామి కుమార్తె మంగళవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయినట్లు ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. సైదులుస్వామి కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి భోజనం అనంతరం నిద్రపోయారు. అర్థరాత్రి మెలుకువ వచ్చిన సైదులుస్వామికి ఇంట్లో కుమార్తె కనిపించలేదు. కుమార్తె ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. సైదులు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వాటర్ హీటర్ నుంచి విద్యుత్..ఒకరి మృతి

చింతలపూడి, ఆగస్టు 8: చింతలపూడి నాగిరెడ్డిగూడెంలో విద్యుత్‌షాక్‌కు గురై షిఫ్ట్ ఆపరేటర్ దేశావత్ రవి (36) దుర్మరణం పాలయ్యాడు. ఇంట్లో నీళ్ళు కాయటానికి వాటర్ హీటర్ పనిచేయడం లేదని చూసి ప్లగ్ పెడుతుండగా సప్లై రావడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురైయ్యాడు. చింతలపూడి ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది.

సిమ్మెంట్ డీలర్‌షిప్ ఇప్పిస్తానని మోసం

ద్వారకాతిరుమల, ఆగస్టు 8 : ద్వారకాతిరుమల మండలంలో కాకతీయ సిమ్మెంటు ఏజన్సీ ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. కిరణ్ కుమార్ రెడ్డి అనే వ్యక్తి గతేడాది డిసెంబరులో ద్వారకాతిరుమలకు చెందిన పొనమాల నాగరాజు,ఇదే మండలానికి చెందిన తిమ్మాపురం గ్రామానికి చెందిన షేక్ భాషాలకు చెందిన సిమ్మెంటు దుకాణాల వద్దకు వెళ్లి వారిని పరిచయం చేసుకున్నాడు. కాకతీయ సిమ్మెంట్స్ డీలర్‌షిప్ ఇప్పిస్తానని చెప్పి షేక్ భాషా నుంచి రూ.1.56 లక్షలు, నాగరాజేష్ నుంచి రూ.2.08 లక్షలు తీసుకున్నాడు. ఈ విషయమై కాలయాపన జరపడంతో అనుమానం వచ్చి వారిద్దరూ ద్వారకాతిరుమల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ జి.సతీష్ తెలిపారు.

వరుస చోరీలతో భయం..భయం

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 8 : ఇటీవల కాలంలో పాలకొల్లు పట్టణం, మండలంలోనూ ఇళ్ళల్లో దొంగతనాలు పెరిగిపోతున్నాయి. గతనెలలో పట్టణంలో పగటి సమయంలోనే ఒక వృద్ధురాలిని గాయపరిచి నగదు, నగలు చోరీ చేశారు. ఇది మరువక ముందే పూలపల్లిలోని సాయంత్ర సమయంలో జనం తిరుగుతున్న సమయంలోనే చోరీ జరిగింది. పూలపల్లిలో చిరు వ్యాపారి బక్క శ్రీను బైటకు వెళ్ళగా సాయంత్రం 7.30 సమయంలో శ్రీను భార్య కృష్ణవేణి పిల్లల్ని ట్యూషన్ నుంచి తీసుకువెళ్లింది. ఆ సమయంలో ఇంటిలో చొరబడి సుమారు 20 కాసుల బంగారం, కేజీ వరకూ వెండి వస్తువులు, రూ.5000 నగదు దోచుకుపోయినట్టు శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఒంటరి మహిళలు, తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. పోలీసులు నిఘా పెట్టాలని కోరుతున్నారు.

వివాహిత అదృశ్యం

ముదినేపల్లి, ఆగస్టు 8 : ఇంటిలో చిన్న చిన్న మనస్పర్థలతో ఓ వివాహిత యువతి అలిగి వెళ్లిపోయిన సంఘటన ఇది. ముదినేపల్లికి చెందిన కోన మహాలక్ష్మి భవాని (33) అనే యువతి గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం కుటుంబసభ్యులు వెదికినా ఫలితం లేకపోవడంతో గురువారం రాత్రి ముదినేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆమె తలి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఎస్ఐ వెంకట్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.46/బి, రాజమహేంద్రవరం

ఎన్నికల మహాజన సభ నోటీసు

(ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల నియమావళి 1964లోని నియమము-22(3)(ఎ) ప్రకారము)

ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నెం.46/బి, రాజమహేంద్రవరం యొక్క నూతన పాలకవర్గ సభ్యుల ఎన్నిక జరుపవలసియున్నది. ఈ ఎన్నికల ప్రక్రియ కొరకు ది.25-8-2024 ఆదివారం ఉదయం 8 గం॥ నుండి సాయంత్రం 4గం॥ల వరకు లోకల్ **నియోజకవర్గము(1)**కు సంబంధించిన బ్రాంచీలు అనగా 1. జాంపేట మెయిన్ బ్రాంచ్ 2. మోరంపూడి 3. ధవళేశ్వరం మరియు 4. సీతంపేట బ్రాంచీలకు సంబంధించి ఎన్నిక మహాజన సభ 1. ఎస్.కె.వి.టి ఇంగ్లీషు మీడియం హైస్కూల్, దానవాయిపేట, రాజమహేంద్రవరం 2. ఎస్.కె.వి.టి. డిగ్రీ కళాశా (వై.జంక్షన్), రాజమహేంద్రవరం 3. చున్నీలాల్ జాజూ రోటరీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ కంబాలపేట, వై.జంక్షన్ దగ్గర రాజమహేంద్రవరం 4. జాంపేట బాలికల మున్సిపల్ కార్పొరేషన్ ఎలిమెంటరీ స్కూల్ ,జాంపేట, జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ప్రక్కన్న రాజమహేంద్రవరం (జాంపేట మెయిన్ బ్రాంచి సభ్యులకు) 5. దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్ దానవాయిపేట, రాజమహేంద్రవరం (మోరంపూడి బ్రాంచి సభ్యులకు) 6. ధవళేశ్వరం జెడ్.పి.పి.బాలికల హైస్కూల్, ధవళేశ్వరం (ధవళేశ్వరం బ్రాంచి సభ్యులకు) 7. సి.జి.టి.యం.ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లలితానగర్ రాజమహేంద్రవరం (సీతంపేట బ్రాంచి సభ్యులకు)ల నందు జరుపుటకు మరియు **నాన్‌లోకల్ నియోజకవర్గము(2)**కు సంబంధించిన బ్రాంచీలు అనగా అనపర్తి, గోకవరం, మరియు **నాన్ లోకల్ నియోజకవర్గం (3)**కు సంబంధించిన బ్రాంచీలు పెద్దాపురం, కాకినాడ లకు సదరు బ్రాంచ్ ఆవరణలలో మరియు ఏలూరు, కొవ్వూరు బ్రాంచి సభ్యులకు ఏలూరు బ్రాంచి నందు ఎన్నికల మహాజన సభ జరుపుటకు నిర్ణయించడమైనది. కావున ఓటు హక్కు కలిగిన యావన్మంది సభ్యులు తమ పాలకవర్గ సభ్యులను ఎన్నుకొను నిమిత్తం ఎన్నికల మహాజన సభకు హాజరు కావలసినదిగా కోరడమైనది. సదరు ఎన్నికల మహాజన సభకు హాజరగు సభ్యులు బ్యాంకు వారిచే ఇవ్వబడిన తమ ఫొటో గుర్తింపు కార్డుతో హాజరు కావలసినదిగా కోరడమైనది.

సం/- **యం.జగన్నాథ రెడ్డి**, డివిజనల్ కోపరేటివ్ ఆఫీసర్, రాజమహేంద్రవరం మరియు ఎన్నికల అధికారి
ది.జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.46/బి, రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం, తేది.09.08.2024

ఎన్నికల ప్రకటన

ది.జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.46/బి, రాజమహేంద్రవరం

ఫారము-1

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం అర్బన్ మండలంలోని ది.జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.46/బి, రాజమహేంద్రవరం యొక్క పాలకవర్గమునకు ది.25-08-2024 తేదీ ఆదివారం ఎన్నికలు నిర్వహించుటకు జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధారిటీ తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం వారు నన్ను ఎన్నికల అధికారిగా నియమించినారు.

ఎన్నికల కార్యక్రమము ఈ క్రింది విధంగా ఉంటుంది.

1) బ్యాంకు పేరు, రిజిస్టర్డ్ నెం : ది. జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, నెం.46/బి, రాజమహేంద్రవరం
2) ఎన్నికల విధానం : రహస్య బ్యాలెట్
3) మొత్తము ఎన్నికలు జరుగు స్థానములు మరియు ఎస్.సి/ ఎస్.టి./బి.సి/ మరియు స్త్రీలు/ ఇతరులకు కేటాయింపు ఏమైనా ఉన్నచో : 12 (పన్నెండు) ఎట్టి రిజర్వేషన్లు లేవు
4) నియోజకవర్గముల సంఖ్య : 3

నియోజకవర్గము -1 (లోకల్)

బ్రాంచి పేర్లు	ఓటర్ల జాబిత క్రమ సంఖ్య		ఓటర్ల అడ్మిన్ నెం.		ఎన్నికలు జరుగు స్థానములు
	నుండి	వరకు	నుండి	వరకు	
1. జాంపేట మెయిన్ బ్రాంచి	1	15623	3	32137	10 (పది)
2. మోరంపూడి బ్రాంచి	15624	17765	4153	32135	
3. ధవళేశ్వరం బ్రాంచి	17766	20986	14687	32139	
4. సీతంపేట బ్రాంచి	20987	23752	4561	32122	

నియోజకవర్గము -2 (నాన్ లోకల్)

బ్రాంచి పేర్లు	ఓటర్ల జాబిత క్రమ సంఖ్య		ఓటర్ల అడ్మిన్ నెం.		ఎన్నికలు జరుగు స్థానములు
	నుండి	వరకు	నుండి	వరకు	
1. అనపర్తి బ్రాంచి	1	963	19639	32132	1 (ఒకటి)
2. గోకవరం బ్రాంచి	964	1901	21564	32089	

నియోజకవర్గము -3 (నాన్ లోకల్)

బ్రాంచి పేర్లు	ఓటర్ల జాబిత క్రమ సంఖ్య		ఓటర్ల అడ్మిన్ నెం.		ఎన్నికలు జరుగు స్థానములు
	నుండి	వరకు	నుండి	వరకు	
1. పెద్దాపురం బ్రాంచి	1	757	20000	32004	1 (ఒకటి)
2. కాకినాడ బ్రాంచి	758	1591	21176	32046	
3. ఏలూరు బ్రాంచి	1592	2064	22814	32044	
4. కొవ్వూరు బ్రాంచి	2065	2071	31844	32105	

5) పోలింగ్ జరుగు తేది, సమయము మరియు ప్రదేశము (పోటీ అనివార్యమైనపుడు) : ది 25-08-2024 ఆదివారం ఉదయం 8 గం॥ల నుండి సాయంత్రం 4 గం॥ల వరకు

నియోజకవర్గము -1 (లోకల్)

బ్రాంచి పేర్లు	ఎన్నికలు జరుగు స్థలము
1. జాంపేట మెయిన్ బ్రాంచి	1. ఎస్.కె.వి.టి. ఇంగ్లీషు మీడియం హైస్కూల్, దానవాయిపేట, రాజమహేంద్రవరం. 2. ఎస్.కె.వి.టి. డిగ్రీ కళాశాల (వై. జంక్షన్) రాజమహేంద్రవరం. 3. చున్నీలాల్ జాజూ రోటరీ మున్సిపల్ కార్పోరేషన్ హైస్కూల్, కంబాలపేట, రాజమహేంద్రవరం. 4. జాంపేట బాలికల మున్సిపల్ కార్పోరేషన్ ఎలిమెంటరీ స్కూల్ జాంపేట, రాజమహేంద్రవరం.
2. మోరంపూడి బ్రాంచి	దానవాయిపేట మూన్సిపల్ హైస్కూల్ దానవాయిపేట, రాజమహేంద్రవరం.
3. ధవళేశ్వరం బ్రాంచి	జెడ్.పి.పి బాలికల హైస్కూల్, ధవళేశ్వరం.
4. సీతంపేట బ్రాంచి	సి.జి.టి.యం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ లలితా నగర్ రాజమహేంద్రవరం.

నియోజకవర్గము -2 (నాన్ లోకల్)

బ్రాంచి పేర్లు	ఎన్నికలు జరుగు స్థలము
1. అనపర్తి బ్రాంచి	ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., అనపర్తి డోర్ నెం: 6-276, పంచాయితీ ఆఫీసు ప్రక్కన, శేషగిరిరావు పేట, అనపర్తి.
2. గోకవరం బ్రాంచి	ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., గోకవరం డోర్ నెం: 8-86, లారీ ఓనర్స్ అసోసియేషన్ బిల్డింగ్, మెయిన్ రోడ్డు, గోకవరం.

నియోజకవర్గము -3 (నాన్ లోకల్)

బ్రాంచి పేర్లు	ఎన్నికలు జరుగు స్థలము
1. పెద్దాపురం బ్రాంచి	ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., పెద్దాపురం డోర్ నెం: 16-12-49, పాత గవర్నమెంట్ హాస్పటల్ వీధి, పెద్దాపురం.
2. కాకినాడ బ్రాంచి	ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., కాకినాడ డోర్ నెం: 70-3-2, ఆర్టీసీ కాలనీ రోడ్డు, రమణయ్యపేట, సర్పవరం జంక్షన్, కాకినాడ.
3. ఏలూరు బ్రాంచి మరియు కొవ్వూరు బ్రాంచి	ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., ఏలూరు డోర్ నెం: 23ఎ-9-10, శంకరమఠం వీధి, ఆర్.ఆర్.పేట, ఏలూరు.

6. నామినేషన్ల స్వీకరణ తేది, సమయం ప్రదేశము (షె.కులము రూ 200/-, షె తగలు రూ.200/- వెనుకబడిన తరగతులు రూ. 400/- ఇతరులు రూ 1000/- నామినేషన్ రుసుముగా చెల్లించాలి) : ది.16-08-2024 శుక్రవారం ఉ.11గం.ల నుండి సా.5 గం.ల వరకు బ్యాంక్ ప్రధాన కార్యాలయం ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్, రాజమహేంద్రవరం, జాంపేట
7. నామినేషన్ల పరిశీలన తేది సమయము మరియు ప్రదేశము : ది.17-08-2024 శనివారం ఉ.11గం.ల నుండి సా॥ 5గం॥లకు బ్యాంకు ప్రధాన కార్యాలయం, ది.జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి, రాజమహేంద్రవరం, జాంపేట
8. నామినేషన్ల ఉపసంహారణ తేది సమయము మరియు ప్రదేశము : ది.18-08-2024 ఆదివారం ఉ.11 గం.ల నుండి సా.5 గం. వరకు బ్యాంకు ప్రధాన కార్యాలయం, ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి, రాజమహేంద్రవరం, జాంపేట.
9. పోటీ దారులకు గుర్తుల కేటాయింపు : ది.18.08.2024 ఆదివారం సా.5గం॥ల తరువాత బ్యాంక్ ప్రధాన కార్యాలయం ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి., రాజమహేంద్రవరం, జాంపేట
10. ఎన్నికలు జరుగు తేది : ది.25.08.2024 ఆదివారం ఉదయం 8గం.ల నుండి సాయంత్రం 4 గం.లకు వరకు
11. ఓట్లు లెక్కింపు జరుగు తేది సమయము మరియు ప్రదేశము : ది.26-8-2024 సోమవారం ఉ.8 గం.ల నుండి ఎస్.కె.వి.టి.డిగ్రీ కళాశాల (వై.జంక్షన్), రాజమహేంద్రవరం
12. ఎన్నికల ఫలితములను ప్రకటించు తేది, సమయము మరియు ప్రదేశము : ది.26-08-2024 సోమవారం కౌంటింగ్ పూర్తయిన పిదప, ఎస్.కె.వి.టి.డిగ్రీ కళాశాల (వై.జంక్షన్) రాజమహేంద్రవరం
13. ఆఫీస్ బేరర్ల ఎన్నిక, పాలక మండలిలో భర్తీ కాని స్థానములను మరియు ఖాళీలగు స్థానములను కో-ఆప్షన్ ద్వారా భర్తీ చేయుట : ది.27-08-2024 మంగళవారం ఉ.8గం.ల నుండి ప్రధాన కార్యాలయం, ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన బ్యాంక్ లి., రాజమహేంద్రవరం, జాంపేట.

గమనిక:

i) నామినేషన్ల ఉపసంహారణ అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికయినచో ది.18-08-2024 సాయంత్రం 5గం.ల తరువాత ఫలితాలు ప్రకటించబడును మరియు ఆఫీసు బేరర్ల ఎన్నిక ది.19-08-2024వ తేదీన ఉదయం 8 గం.ల నుండి ప్రధాన కార్యాలయం నందు జరుపబడును.
ii) బ్యాంక్ సభ్యులు బ్యాంకు యొక్క బ్రాంచిల నందు గల నోటీసు బోర్డులో ఉంచబడిన ఓటింగ్‌కు అర్హత గల సభ్యుల జాబితాను పరిశీలించు కోవచ్చును.

సం/- **యం.జగన్నాథరెడ్డి**
డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్,
రాజమహేంద్రవరం మరియు ఎన్నికల అధికారి
ది.జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నెం.46/బి, రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం
తేది.09-08-2024



ఏజెన్సీలో కొట్టుకుపోయిన రోడ్డుపై విద్యార్థులు, స్థానికుల పాట్లు



కైకరం వద్ద జాతీయ రహదారి మార్జిన్ బస్ షెల్టర్ మధ్య వర్షపు నీరు



ఏలూరు మెడికల్ కాలేజీ సమీపంలో అధ్వానమైన రోడ్డు

రోడ్లు ధ్వంసం

ఏజెన్సీలో కొట్టుకుపోయిన రహదారులు

బుట్టాయగూడెం, ఆగస్టు 8: పశ్చిమ ఏజెన్సీలో ఏకధాటిగా కుండపోత వర్షాలకు అటవీ ప్రాంతంలో కొండరెడ్డి గ్రామాలకు వెళ్లేందుకు నిర్మించిన రోడ్లు పూర్తిగా కొట్టుకుపోగా అనేక చోట్ల పెద్దపెద్ద గండ్లు పడ్డాయి. కాలి నడకన వెళ్లడానికి కూడా వీలులేకుండా రోడ్లు కొట్టుకుపోవడంతో అటవీ ప్రాంతాల్లోని కొండరెడ్లు నరకయాతన పడుతున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు పాడైపోయిన రోడ్లు గత మూడు రోజులుగా కురుస్తున్న వానలకు నామరూపాలు లేకుండా కొట్టుకుపోయాయి. అనేక ప్రాంతాల్లో గండ్లు పడ్డాయి. గురుగుమిల్లి నుంచి రెడ్డిబోడ్డేరు, చింతకొండ, గొట్టాలరేవు, పూసిగొంది కొండరెడ్డి గ్రామాల రోడ్లు కొట్టుకుపోయాయి. గురుగుమిల్లి నుంచి గొట్టాల రేవు రోడ్డుకు కొండకాలువ అడ్డంగా ప్రవహిస్తుంది. భారీవర్షాలకు రోడ్డు కొట్టుకుపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం పాఠశాలకు వెళుతున్న ఉపాధ్యాయుడు రోడ్డుపై గండిని గ్రామస్తుల సహకారంతో అతికష్టంమీద పాఠశాలకు చేరుకున్నారు. రోడ్లను బాగుచేయాలని పలువురు కోరుతున్నారు.

జాతీయ రహదారి అధ్వానం..

ఉంగుటూరు: కైకరం వద్ద జాతీయ రహదారి మార్జిన్ ముంపుతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గతంలో ఇక్కడ రహదారి విస్తరణ నేపథ్యంలో డ్రెయిన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. హైవే వంతెన నిమిత్తం విస్తరణలో భాగంగా పెద్ద పెద్ద గోతులతో జనాలు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతం.

వైద్య కళాశాల రోడ్డుపై వెళ్లలేం..

ఏలూరు కార్పొరేషన్: నగరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, మెడికల్ కాలేజీ సమీపంలో రోడ్లు గోతులమయం కావడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై గోతులో నీరు, బురదతో వాహనదారులు జారిపడి గాయాలపాలవుతున్నారు. ఇదే రోడ్డు మలుపులో డ్రెయినేజీపై స్లాబులు లేకపోవడం ప్రమాదాలకు నిలయంగా మారాయి. నగర పాలక సిబ్బంది చర్యలు తీసుకుని గోతులను పూడ్చాలని, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

● పోలవరం: మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గురువారం కొత్త నూతనగూడెం ప్రాథమిక పాఠశాల ఆవరణ నీట మునిగింది. ఆవరణలో మోకాలి లోతు నీరు చేరడంతో విద్యార్థులను సమీపంలోని రామాలయానికికి తరలించి తరగతులు నిర్వహించారు. ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్ఎం వెంకటరమణ తెలిపారు.

వసతి గృహ సమస్యలపై విద్యార్థినుల నిరసన



ప్రదర్శన నిర్వహిస్తోన్న విద్యార్థినులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 8: అమీనాపేట ఎస్సీ బాలికల సమీకృత వసతి గృహ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. జిల్లా కార్యదర్శి లెనిన్ మాట్లాడుతూ వెయ్యి మంది బాలికలున్న హాస్టల్ ప్రాంగణం అధ్వానంగా ఉందని, మురుగునీటితో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మురుగు, డ్రెయిన్లు శుభ్రం చేయకపోవడంతో అనారోగ్య పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపట్టకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు.

16, 17 తేదీల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావేశాలు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సమావేశాలను ఈ నెల 16, 17తేదీల్లో ఏలూరులో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర కార్యదర్శి అశోక్ వెల్లడించారు. సమావేశాల పోస్టర్లను గురువారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. విద్యార్థుల కష్టాలు, భవిష్యత్‌లో ఎదుర్కొనబోయే సవాళ్లు, పోరాట మార్గాలు రాష్ట్ర సమావేశాల ప్రధాన అజెండాగా ఉంటాయన్నారు. జిల్లా కార్యదర్శి లెనిన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

ఏలూరు రూరల్, ఆగస్టు 8: ఏఎస్ఆర్ నగర్‌లో గ్రామంలో మంచినీరు, విద్య, వైద్యం సమస్యలను పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ టి.నరసాపురం మండలం పుట్రేపు ఏఎస్ఆర్‌నగర్ గ్రామంలో సర్వేనెంబర్ 86లో సుమారు 89.68 ఎకరాల గుట్టపోరంబోకు భూమిలో 2006 నుంచి ఇళ్లు నిర్మించుకుని గిరిజనులు, దళితులు నివాసం ఉంటున్నారన్నారు. అక్కడ నివాసం ఉంటున్న 70 కుటుంబాల వారి ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన మహిళలపై స్థానిక భూస్వాములు, బినామీలు దాడిచేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పేదలకు జేసీ కోర్టు, హైకోర్టు, సానుకూలంగా తీర్పుఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని ఫలితంగా పేదలకు నష్టం జరిగిందన్నారు. రెవెన్యూ రికార్డులు తారుమారుచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

సంపద కేంద్రాలకు నిధులు : ఎమ్మెల్యే బాలరాజు



పారిశుధ్య కార్మికుల్ని సత్కరిస్తున్న ఎమ్మెల్యే

జీలుగుమిల్లి, ఆగస్టు 8: చెత్త నుంచి సంపద కేంద్రాలకు నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. పి.అంకంపాలెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. నిధులు మంజూరు చేసి పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. డీఎల్‌పీవో ఎండీ రజావుల్లా, డీఎల్‌డీవో రాజు, ఎంపీడీవో కెఎం.మంగతాయారు, ఈవోపీఆర్డీ నిఖిల్, కార్యదర్శులు దేవప్రియుడు, సుబ్రమణ్యం, 167 మంది కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు, నాయకులు పసుపులేటి రాము, సాయి, కొండపల్లి ప్రసాద్, చాట్రాతి ప్రసాద్ ఉన్నారు.

నిర్వాసితులకు అన్యాయం జరిగితే సహించం

జీలుగుమిల్లి, ఆగస్టు 8: పోలవరం నిర్వాసితులకు అన్యాయం జరిగితే ఊరుకోమని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. పి.అంకంపాలెంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిర్వాసితులకు కేటాయించిన భూముల్లో కొందరు అక్రమ సాగుకు చూస్తున్నారన్నారు. నిర్వాసితుల భూములు వారికి అప్పగించాలన్నారు. లేకుంటే వారిని జైలుకు పంపిస్తామన్నారు. రోడ్ల నిర్మాణానికి అంచనా రూపొందించామన్నారు. నిర్వాసిత గ్రామాలతోపాటు నియోజకవర్గంలో గ్రావెల్, సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం, వీటిపై సీఎం చంద్రబాబుకు విన్నవించినట్లు తెలిపారు.

చంద్రబాబు ఫ్లెక్సీకి రేషన్ డీలర్ల పాలాభిషేకం



పాలాభిషేకం చేసిన డీలర్లు

ఏలూరు రూరల్, ఆగస్టు 8: రేషన్‌డీలర్ల వ్యవస్థకు పూర్వవైభవం తెచ్చే ప్రకటన చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ రేషన్‌డీలర్లు గురువారం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రేషన్‌డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజులపాటి గంగాధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పంపిణీ పేరుతో రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. వైసీపీ నాయకులు రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించారని విమర్శించారు. చంద్రబాబు సూచనతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు. జిల్లా కార్యదర్శి వాసిరెడ్డి నరసింహారావు, కృష్ణంరాజు, మరీదు వెంకట్రావు, వెంకటేశ్వరరావు, రంగారావు, షాకీర్, నాగు, పిల్లా శివ, 15 మండలాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

25 మందికి ఉద్యోగ నియామక పత్రాలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 8: సెట్‌వెల్ కార్యాలయం వద్ద జిల్లా ఉపాధి కార్యాలయం, నేషనల్ కెరీర్ సర్వీస్(ఎన్‌సిఎస్), యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 115 మంది పాల్గొన్నారు. 25 మందిని ఎంపిక చేసి వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేసినట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి మధుభూషణరావు తెలిపారు. కార్యక్రమంలో జి.ప్రవీణ్‌కృష్ణ, జి.వరలక్ష్మి, పీఎస్.సత్యనారాయణ, పర్యవేక్షకులు కె.జె.కెనడి, పసుపులేటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

14న హెచ్‌సీఎల్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూ

ఏలూరు రూరల్, ఆగస్టు 8: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంటర్మీడియట్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ టెక్‌బీ కెరీర్ ప్రోగ్రామ్ ద్వారా ఉద్యోగ అవకాశాలకు ఈనెల 14న క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఘంటా సుధాకర్ గురువారం తెలిపారు. సీఈసీ, హెచ్‌ఈసీ, బైపీసీ, ఒకేషనల్ పూర్తిచేసి, 75శాతం కంటే ఎక్కువ ఉన్న అభ్యర్థులు అర్హులు అన్నారు. విటెక్‌బీ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఏడాదిపాటు ఉంటుందని, మొదటి మూడునెలలు మధురైలో క్లాస్‌రూమ్ ట్రైనింగ్, చివరి 9నెలల్లో చెన్నై హెచ్‌సీఎల్ క్యాంపస్‌కు ఇంటర్న్‌షిప్‌కు వెళ్లాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9666322032 నెంబర్‌లో సంప్రదించవలసిందిగా సుధాకర్ సూచించారు.

పునరావాస కాలనీ సమస్యలపై ఆందోళన

బుట్టాయగూడెం, ఆగస్టు 8: పునరావాస కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దొరమామిడి సమీపంలోని కొయిదా కాలనీకి చెందిన కొండరెడ్డి నిర్వాసితులు గురువారం ఆందోళన చేశారు. శ్మశాన వాటిక చూపాలని, గంగమ్మ చెరువు కట్టకు మరమ్మతులు చేయాలని, కల్వర్టును నిర్మించాలని కోరారు. 41.15 కాంటూర్ పరిధిలో కలిపి అన్ని రకాల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలను నిర్వాసితుల ఖాతాల్లో జమచేయాలన్నారు. నిర్వాసితులకు న్యాయం చేశాకే కాలనీలకు తరలించాలన్నారు. 2017 కటాఫ్ తేదిని రద్దుచేసి పునరావాస కాలనీలకు వచ్చేనాటికి 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజి ఇవ్వాలని, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

చల్లావారిగూడెం కాలనీలో పాఠశాల ప్రారంభం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 8: చల్లావారిగూడెం నిర్వాసిత కాలనీ ప్రజలు ఎదురుచూస్తున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను విద్యాశాఖ అధికారులు గురువారం ప్రారంభించారు. నిర్వాసిత కాలనీలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అధికారులు పాఠశాల ఏర్పాటు చేయడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఎంఈవోలు రాముడు, రాములు, శ్రీనివాసరావు, టీచర్ వెంకటేష్, మిరియాల పుల్లారావు, సత్యనారాయణ, గణేశుల ఆదినారాయణ, సంజయ్, సుధాకర్, క్రాంతికుమార్, మోహన్, హరిబాబు పాల్గొన్నారు.



తోటగూడెంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

సమగ్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

పెదపాడు, ఆగస్టు 8: ప్రజా సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధి చంద్రబాబు ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. తోటగూడెంలో గురువారం జరిగిన మీ కోసం - మీ చింతమనేని కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామసభ నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుని, వారి నుంచి వినతులు స్వీకరించారు. తాగు, సాగు నీరు, గ్రామాల్లో పారిశుద్యం, డ్రెయిన్ల మరమ్మతు, అంతర్గత రహదారులు అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందజేస్తామన్నారు. గ్రామసభ ద్వారా దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉప్పలపాటి రామ్‌ప్రసాద్, గుత్తా అనిల్, లావేటి శ్రీనివాసరావు, పెద్ది రమేష్, కంభంపాటి సునీల్‌కుమార్, దండమూడి సీతారాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తమ్మిలేరుకు వరద.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు టూటౌన్, ఆగస్టు 8: తమ్మిలేరు వరద ఉధృతంగా ఉందని, నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. తమ్మిలేరు కాల్వను ఆయన పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి భోజనవసతి కల్పించాలని ఆర్డీవోకు సూచించారు. చోడే వెంకటరత్నం, నెరుసు గంగరాజు, ఆర్నేపల్లి తిరుపతి ఉన్నారు.

ఆదివాసీ దినోత్సవానికి రూ.లక్ష విరాళం

జీలుగుమిల్లి, ఆగస్టు 8: ఐటీడీఏలో జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడక నిర్వహణకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు రూ.లక్ష విరాళం అందజేశారు. టీడీపీ నియోజవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ రూ.50వేలు అందజేశారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** డెంగీ జ్వరాలు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టినట్లు చింతలపూడి కమిషనర్ ఎస్పీ రాజు తెలిపారు. ఇటీవల జ్వరంతో సీతారాములు మృతి చెందడంతో ఎంపీ పుట్టా మహేష్ నివారణ చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను ఆదేశించారు. దీంతో రోడ్లపై నిలిచిన నీరును తొలగించారు. దోమలు ప్రబలకుండా ఫాగింగ్ చేశారు.
- **ఏలూరు అర్బన్ :** తలసేమియా బాధితులక కోసం సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 119మంది రక్తదానం చేశారని ప్రిన్సిపాల్ రామరాజు తెలిపారు. కొడాలి వెంకట సుబ్బారావు, కానాల శ్రీనివాసరావు, జి.తులసి, రమణ, భాషా, లక్ష్మీసరస్వతి, గీత, ప్రసాద్, జ్యోతి, రత్నాకర్ పాల్గొన్నారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** ఆదివారపుపేట షిరిడీసాయి ప్రేమమందిరం సేవకుల నుంచి సేకరించిన రూ.35 వలను కమిటీ అధ్యక్షులు ఇసుకపల్లి తాతారావు, గురువు వాసా ప్రసాద్ జ్ఞానేశ్వరి లివర్ మార్పిడి వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు.
- **కామవరపుకోట :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవాన్ని నిర్వహించారు. పిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు, అధ్యాపకులు దారావతు మల్లేష్, విద్యార్థులుపాల్గొన్నారు.
- **చింతలపూడి :** యర్రంపల్లిలో జగ్గవరపు కోటిరెడ్డి కుటుంబాన్ని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం పరామర్శించారు. కోటిరెడ్డి భార్య వెంకాయమ్మ, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. చినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు గాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, ఐడీసీ చైర్మన్ ఎం.విజయ్‌బాబు పాల్గొన్నారు.
- **బుట్టాయగూడెం :** ఆదివాసీలను అడవుల నుంచి గెంటివేసే చర్యలను పాలకులు మానుకోవాలని ఏఐకేఎంఎస్ నేత పి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివాసీల మనుగడకోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.
- **టి.నరసాపురం :** విధుల్లో అలసత్వంగా వ్యవహరిస్తున్న ఆశావర్కర్లపై చర్యలు తీసుకోవాలని గండిగూడెం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. పీహెచ్‌సీ వద్ద ఆందోళన నిర్వహించి వైద్యాధికారి కల్పనారాణికి వినతిపత్రం అందజేశారు.
- **పోలవరం :** మండలంలో భారీ వర్షాలకు ఎల్ఎన్‌డీ పేటలో శ్మశానం నీట మునిగింది. గురువారం గ్రామంలో మృతదేహాన్ని వాహనంపై కొవ్వూరు శ్మశాన వాటికకు తరలించారు.
- **పోలవరం :** రెడ్‌క్రాస్ సొసైటీ, జీఎస్టీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల, జంగారెడ్డిగూడెం సూర్య, రామచంద్ర డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. 600 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.

ప్రశాంతంగా పాఠశాల కమిటీ ఎన్నికలు



సీహెచ్ పోతేపల్లి పాఠశాల వద్ద ఉద్రిక్తత పరిస్థితి

పెదపాడు, ఆగస్టు 8: పెదపాడు మండలంలో 56 ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎంపిక గురువారం ప్రశాంతంగా జరిగింది. కమిటీల ఎంపికను ఎంపీడీవో తేజరతన్, ఎంఈవోలు ఎస్.నరసింహమూర్తి, డీవీ.రమణ, తహసీల్దారు ఎస్‌వీడీ ప్రసాద్ పర్యవేక్షించారు. నూతన కమిటీలను అభినందించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పెదపాడు హైస్కూల్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైన వడ్డాది నాగ సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన పెందుర్తి నిర్మలకుమారిని సన్మానించారు. హెచ్.ఎం. పి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: మండలంలోని పాఠశాల కమిటీల ఎన్నికలు సజావుగా సాగాయి. కైకరం హైస్కూలు ఎన్నిక ఏకగ్రీవం జరిగింది. చైర్‌పర్సన్‌గా అల్లూరి జగదీశ్వరి ఉంగుటూరు హైస్కూలు చైర్మన్‌గా కరోతి ఉదయ భాస్కర్ ఎన్నికయ్యారు.

● వేలేరుపాడు: మండలంలోని 54 ప్రభుత్వ పాఠశాలల ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎంఈవో శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీహరి పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. వేలేరుపాడు జడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా బేతి శ్రీనివాసరావు, వీసీగా కట్టం కనకదుర్గ, భూదేవిపేట కేజీబీవీ పాఠశాలకు చైర్మన్‌గా సీహెచ్.రజని, వైస్ చైర్మన్ కే.శ్రీను శివకాశీపురం గిరిజన బాలికల ఆశ్రం పాఠశాలకు చైర్మన్‌గా ఎం.ఇంద్ర ఎన్నికయ్యారు.

● కుక్కునూరు: మండలంలో ఎస్ఎంసీ ఎన్నికల్లో కూటమి మద్దతుదారులు విజయం సాధించారు. మండలంలో జడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూరి బాబాలికల విద్యాలయం, గిరిజన బాలికల వసతి పాఠశాల, గిరిజన, ప్రాథమిక పాఠశాలల్లో 108 ఎస్ఎంసీ చైర్మన్ ఎన్నికల్లో 105 మంది చైర్మన్‌లు కూటమి మద్దతుదారులు గెలుపొందారు.

● జంగారెడ్డిగూడెం: మండలంలోని 72 ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్, ఎస్సై సుధీర్‌బాబు, తహసీల్దారు కె.స్లీవజోజి, ఎంపీడీవో కేవీప్రసాద్, ఎంఈవోలు బి.రాముడు, జి.రాములు పర్యవేక్షించారు. జంగారెడ్డిగూడెం పట్టణ బాలికల ఉన్నత పాఠశాల చైర్మన్‌గా జోగి నాగరాజు ఎన్నికయ్యారని హెచ్ఎం గ్లోరీ ప్రశాంతి తెలిపారు. లక్కవరం ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా దల్లి దుర్గారెడ్డి ఎన్నికయ్యారు. మండలంలో కూటమి బలపరచిన అందరూ గెలవడంపై హర్షం వ్యక్తం చేశారు.

● కామవరపుకోట: రామన్నపాలెం పాఠశాల విద్యా కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. తడికలపూడి, రావికంపాడు హైస్కూల్, మండలంలో పలు పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు.

● భీమడోలు: మండలంలో 35 ప్రాథమిక పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు, ఏడు జడ్పీ హైస్కూల్స్‌లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఆయా పాఠశాలలకు సంబంధించిన మేనేజ్‌మెంట్ కమిటీల కన్వీనర్, కో కన్వీనర్లతో పాటు మొత్తం 550 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాఠశాల అభివృద్ధికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు కృషి చేయాలని హెచ్‌ఎంతో పాటు ఎంఇవో భాస్కర్ కుమార్, శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారులు సూచించారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.

● ఏలూరు రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 56 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు నిర్వహించారు. మధ్యాహ్నం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అనంతరం ప్రమాణస్వీకారం జరిగింది. 3 గంటల నుండి 3.30 గంటల వరకు ఎస్ఎమ్‌సీ కమిటీ తొలి సమావేశం నిర్వహించారు.

● చింతలపూడి: మండలంలోని 96 పాఠశాలల్లో కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అన్నిచోట్ల ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయని ఎంఈవో కిరణ్‌బాబు తెలిపారు. ఆయా పాఠశాలల్లో కమిటీల ద్వారా పర్యవేక్షణకు, పాఠశాల అభివృద్ధికి దోహద పడతాయని పలువురు పేర్కొన్నారు.

● టి.నరసాపురం: మండలంలో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో టి.రామ్మూర్తి తెలిపారు. మొత్తం 60 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యుల ఎన్నికలు జరిగాయని 28 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవం కాగా 32 పాఠశాలల్లో ఓటింగ్ ద్వారా ఎన్నికలు జరిగాయన్నారు. ఎన్నిక కాబడిన వారితో ప్రమాణస్వీకారం చేయించామని తెలిపారు.

● జీలుగుమిల్లి: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో ఎం.శ్రీనివాస్ చెప్పారు. మండలంలో 49 పాఠశాలల్లో 35 ఏకగ్రీవం, 14 చేతులు ఎత్తి ఎన్నుకునే పద్దతిలో ఎన్నికలు జరిపారు. తహసీల్దార్, ఎంపీడీవో, వీఆర్వో, పంచాయితీ కార్యాదర్శులు ఎన్నికలు పర్యవేక్షించారు.

సీహెచ్ పోతేపల్లిలో రాజకీయ రంగు

ద్వారకాతిరుమల: మండలంలోని 64 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఒకటి రెండు చోట్ల స్వల్ప ఉద్రిక్తత మినహా ప్రశాంతంగా జరిగాయి. సీహెచ్ పోతేపల్లి ఎంపీయూపీ పాఠశాలలో కూటమి, వైసీపీ నాయకుల మధ ఆదిపత్య పోరు చోటు చేసుకుంది. ఒకానొక సమయంలో వివాదం తారస్థాయికి చేరడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. చివరకు కూటమి నేతలే పట్టు సాధించారు. తాయిలాల పంపిణీ సైతం భారీగా జరిగినట్లు చెబుతున్నారు. ఓటర్లను ప్రలోభానికి క్యాంపు రాజకీయం సైతం నిర్వహించినట్లు సమాచారం. పాఠశాలలోని 8, 7వ తరగతుల్లో ముగ్గురు సభ్యుల ఎన్నికలో వివాదం రాజుకుంది. సభ్యుల ఎన్నిక రెండుసార్లు జరగడంతో గందరగోళం నెలకొంది. సభ్యులను తమవైపు లాక్కునేందుకు వైసీపీ ప్రయత్నాలు విఫలమయ్యాయి. కూటమి బలపరిచిన వారినే చైర్మన్‌గా కేవీ ఫణీంద్ర, వైస్ చైర్మన్‌గా బీఎస్ లక్ష్మీలను ప్రకటించడతో వివాదం సద్దుమణిగింది.

వేమవరప్పాడులో ఉత్కంఠ

» వ్యూహాత్మకంగా వ్యవహరించిన గ్రామ టీడీపీ నేతలు

» మండలంలో 41 పాఠశాలలు ఏకగ్రీవం » 19చోట్ల పోటీ


వేమవరప్పాడు ఎంపీయూపీ స్కూల్ ఎస్ఎంసీ కమిటీ సభ్యులు

కైకలూరు, ఆగస్టు 8: పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. సాదాసీదా జరగవలసిన ఎన్నికలు ఓ గ్రామంలో ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో పోలీసు బందోబస్తు నడుమ ఎన్నికలు జరిగాయి. గురువారం కైకలూరు మండలంలో 60 ప్రాథమిక, జిల్లా పరిషత్ హైస్కూళ్లల్లో ఎన్నికలు జరిగాయి. వీటిలో 41 పాఠశాలల్లో ఏకగ్రీవం కాగా 19 పాఠశాలల్లో పోటీ పడ్డారు. వేమవరప్పాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలు ఉత్కంఠ బరితంగా సాగాయి. గ్రామంలో వైసీపీ నాయకులు ఈ ఎన్నికలను పోటీకి దింపడంతో ఉత్కంఠ రేపింది. దీంతో ఒక ఎస్సై ఐదుగురు పోలీసులు ఈ ఎన్నికలకు కాపాల కాయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. పాఠశాలలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఉండ డంతో ఒక్కొక్క తరగతికి ముగ్గురు సభ్యుల చొప్పున 24 మంది, చైర్మన్‌కు పోటీ నిర్వహించారు. అయితే వైసీపీ నాయకులు వేసిన ఎత్తుగడలు ఫలించ కుండా గ్రామ టీడీపీ నేతలు వ్యూహాత్మకంగా వ్యహరించడంతో గరికి ముక్కు రత్నంను చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. వైస్ చైర్‌పర్సన్‌గా చావలి అంకమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికలు పెద్దఎత్తున నిర్వహించడంతో పోలీసులకు వచ్చిన సమాచారాంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా బందోబస్తు నిర్వహించారు. ఈ ఎన్నికలను పురస్కరించుకొని గ్రామంలో పెద్దఎత్తున ప్రచారం జరగడంతో గ్రామస్థులు భారీగా పాఠశాల వద్దకు చేరుకున్నారు. అయితే 60 పాఠశాలల్లోనూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో-2 వి శ్రీనివాసరావు తెలిపారు.


మండవల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రుల నూతన కార్యవర్గం


ముసునూరులో ఎస్ఎంసీ చైర్మెన్, వైస్ చైర్మెన్‌లను అభినందిస్తున్న టీడీపీ నాయకులు


ఆగిరిపల్లిలో నూతన విద్యా కమిటీ సభ్యులు


ముదినేపల్లి శ్రీహరిపురం పాఠశాల చైర్మన్ అంజలికి ఎన్నికైన పత్రాన్ని అందిస్తున్న హెచ్ఎం అమ్మన్న

ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతం

నూజివీడు టౌన్ 8 :పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికలు నూజివీడులో ప్రశాంతంగా జరిగాయి. నూజివీడు పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో యాజమాన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహించగా నూజివీడు ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల చైర్మన్‌గా ఆబోతుల లక్ష్మి, వైస్ చైర్మన్‌గా రౌతు నాగమణి ఎన్నికయ్యారు. ఇక బాలికోన్నత పాఠశాల చైర్మన్‌గా నెర్సు నాగులు, వైస్ చైర్మన్‌గా పానుగంటి శాంత కుమారి ఎన్నికయ్యారు.

● ముసునూరు : మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు ప్రశాతంగా జరిగాయి. అన్ని పాఠశాలల్లో ఈ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ఎంఈవో బీవీ సుబ్బారావు పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. ముసునూరు జడ్పీ పాఠశాల ఎస్ఎంసీ చైర్మెన్‌గా నక్కా యోహాను, వైస్ చైర్మెన్‌గా దుక్కిపాటి దీప్తి ఎన్నికయ్యారు. గోపవరం జడ్పీ పాఠశాల చైర్మెన్‌గా కొయ్యూరు పరుశురాం, వైస్ చైర్మెన్‌గా దొద్దుల సునీత, రమణక్కపేట జడ్పీ పాఠశాల చైర్మెన్‌గా నీలుకొండ రాజా, వైస్ చైర్మెన్‌గా దగ్గుమల్లి కృష్ణకుమారి, గుడిపాడు జడ్పీ పాఠశాల చైర్మెన్‌గా నూర్‌బాషా రంగావలి, వైస్ చైర్మెన్‌గా మారుమూడి మణి, చెక్కపల్లి జడ్పీ పాఠశాల చైర్మెన్‌గా పల్లి రామచంద్రరావు, వైస్ చైర్మెన్‌గా షేక్ లూజహాన్, వేల్పుచర్ల జడ్పీపాఠశాల చైర్మెన్‌గా కొసూరు పరుశురాముడు, వైస్ చైర్మెన్‌గా దొద్దుల నాగవరలక్ష్మీ, కాట్రేనిపాడు జడ్పీపాఠశాల చైర్మెన్‌గా పిన్నిబోయిన ఏసు, వైస్ చైర్మెన్‌గా చలమాల జయశ్రీ, గురుకుల బాలికల పాఠశాలకు చైర్మెన్‌గా సాయిల పంగిడియ్య, వైస్ చైర్మెన్‌గా కందేపు రాధికతో పాటు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఎంపీయూపీ పాఠశాలలు-8, ప్రైమరీ పాఠశాలలు-33, ప్రీప్రైమరీ పాఠశాలలు-13లో ఎస్ఎంసీ చైర్మెన్, వైస్ చైర్మెన్లు, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులతో హెచ్ఎంలు ప్రమాణస్వీకారం చేయించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల, గ్రామ పార్టీ టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు నూతన ఎస్ఎంసీల చైర్మెన్, వైస్ చైర్మెన్‌లకు అభినందలు తెలిపారు.

● ఆగిరిపల్లి : మండలంలోని 50 పాఠశాలల్లో 49 పాఠశాలలకు ఎస్ఎంసీ ఎన్నికలు జరగగా కేవలం అడవి నెక్కలం జడ్పీహెచ్ పాఠశాలలో తగిన కోరం లేక ఎన్నికలు నిలిపివేయటం జరిగింది. జడ్పీహెచ్ హైస్కూల్ ఆగిరిపల్లి చైర్మన్‌గా ఆవుల నరేష్, వైస్ చైర్మన్ బట్టుమర్తి స్రవంతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హెచ్ఎం పులి పుష్పలత, అధ్యక్షతన తొలి సమావేశం జరిగింది. ఎంఈవో-1 కె.సర్వేశ్వరరావు, ఎంఈవో-2కె ఆనంద్‌కుమార్, గ్రామ టీడీపీ నాయకులు చౌటుపల్లి విక్టర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

● ముదినేపల్లి : మండలంలో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎంఈవో కె.నరేష్ కుమార్ పర్యవేక్షణలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఎన్నికలను నిర్వహించారు. మండలంలో 67 పాఠశాలలు ఉండగా, 15 మంది విద్యార్థులలోపు ఉన్న 15 పాఠశాలలకు ఎన్నికలు ప్రక్రియ లేకుండానే సభ్యులతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగగా, 52 పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. వీటిలో 50 పాఠశాలలకు సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ఏకగ్రీవం కాగా, రెండు పాఠశాలల చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నికలు జరిగాయి. బొమ్మినంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎస్ఎంసీ ఎన్నికల్లో పోటీ ఏర్పడింది. సభ్యుల ఎన్నిక పూర్తయ్యాక జరిగిన ఎన్నికల్లో చైర్మన్‌గా అల్లాడ సత్యనారాయణ, వైస్ చైర్మన్‌గా దండే రమాదేవి పది మంది సభ్యుల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. దీంతో తాము బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించటంతో టీడీపీ, జనసేన నాయకులు యర్రా రాంబాబు, బాసినశెట్టి కిషోర్ ఆధ్వర్యంలో విజయోత్సవం జరుపుకున్నారు. చేవూరు యూపీ పాఠశాలకి జరిగిన ఎన్నికల్లో చైర్మన్‌గా పాతూరి అనిత, వైస్ చైర్మన్‌గా తంటెపూడి ప్రశాంతి విజయం సాధించారు. శ్రీహరిపురం పాఠశాల కమిటీని సర్పంచ్, టీడీపీ నాయకులు పరసా విశ్వేశ్వరరావు అభినందించారు. ఎస్ఐ డి.వెంకట్ కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

● మండవల్లి : మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాకమిటీ చైర్మన్‌గా గంగనపల్లి కృష్ణవేణి, వైస్‌చైర్మన్‌గా బురక కార్తీక్ గురువారం ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాల పాలకవర్గ సభ్యులను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని కె.శైలజ ఆధ్వర్యంలో గురువారం ఎన్నికలు నిర్వహజించారు. అలాగే చింతపాడు హైస్కూ ల్ పాలక వర్గం చైర్మన్గా ఎం రజిని ఎన్నికయ్యారు. అయ్య వారిరుద్ర వరం ఎంపీపీ పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి 15 మంది సభ్యులను ఎస్ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్ కో ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. వారిలో వట్టిప్రోలు విజయశాంతి చైర్మన్ కరాటపు శ్రీధర్, వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ పిచ్చేడు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఎక్స్ అఫిషియో మెంబర్స్ పాల్గొన్నారు. ఎన్నికల నిర్వణకు పర్యవేక్షణకునిగా వీఆర్వో గొంతుపులుగు ప్రకాష్ వ్యహరించారు.

62 కమిటీలు ఏకగ్రీవం

చాట్రాయి, ఆగస్టు 8: మండలంలో పాఠశాలల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 63కిగాను, 62 కమిటీలు టీడీపీ సానుభూతిపరులకు ఏకగ్రీవం కాగా, పోతనపల్లి యూపీ స్కూల్ కమిటీ ఎన్నిక వాయిదా పడింది. చాట్రాయి జడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ కమిటీ చైర్మన్‌గా చల్లారి ఆదిలక్ష్మి, వైస్ చైర్మన్‌గా కటారపు ఆనందరావు, చనుబండ జడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా బన్నే వీరయ్య, వైస్ చైర్మన్‌గా సాధు లావణ్య, మర్లపాలెం జడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్‌గా మల్లారి శ్రీలత, వైస్ చైర్మన్‌గా ముల్లంగి మన్మధరావు, కృష్ణారావుపాలెం స్కూల్ కమిటీ చైర్మన్‌గా కల్లేపల్లి అర్జునరావు, వైస్ చైర్మన్‌గా ఊట్ల నాగలక్ష్మి, కొత్తగూడెం మెయిన్ స్కూల్ కమిటీ చైర్మన్‌గా బండారి రాజశేఖర్, వైస్ చైర్మన్‌గా కాటుకూరి మణి, జనార్దనవరం మెయిన్ స్కూల్ కమిటీ చైర్మన్‌గా నందమూరి వరప్రసాద్, వైస్ చైర్మన్‌గా చీపు శ్రావణి, పర్వతాపురం కమిటీకి చైర్మన్‌గా బింగి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా దేవరకొండ మాధవి ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ఎంఈవో వీఎస్వీ బ్రహ్మాచారి ఎన్నికలను పర్యవేక్షించారు.


చనుబండ జడ్పీ హైస్కూల్ కమిటీతో నాయకులు



కలిదిండిలో జడ్పీ హైస్కూల్ చైర్మన్ గొల్లయ్యకు అభినందనలు తెలుపుతున్న కూటమి నాయకులు

కోరం లేక వాయిదా పడిన ఎన్నికలు

కలిదిండి, ఆగస్టు 8 : పెదలంక జడ్పీ హైస్కూల్‌లో కోరం లేకపోవటంతో ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా వేసినట్లు ఎంఈవో నరేష్ కుమార్ తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు. మిగిలిన అన్ని పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. కలిదిండి జడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా తోట గొల్లయ్య, వైస్ చైర్మన్‌గా బండారు నాగమణి, కోరుకొల్లు జడ్పీ హై స్కూల్ చైర్మన్‌గా దాసరి రమేష్, వైస్ చైర్మన్‌గా చెన్నం శెట్టి వరలక్ష్మి, ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా కె.లక్ష్మణరావు, టి.సాయి శిరీష, తాడినాడ జడ్పీ హైస్కూ ల్ చైర్మన్‌గా కె.సింహాద్రి అప్పన్న, వైస్ చైర్మన్‌గా పి.మణి లావణ్య, చినతాడినాడ జడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా కొల్లాటి సత్యవతి, వైస్ చైర్మన్‌గా పెనుమాల శ్రీను, గుర్వాయిపాలెం జడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా పోసిన అర్జునరావు, వైస్ చైర్మన్‌గా టి.భూలక్ష్మి, కొండంగి జడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా డి.వీర్రాజు, వైస్ చైర్మన్‌గా ఈ.ఉదయలక్ష్మి, బాస్కరావుపేట జడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా కోకా శుభాకర్, వైస్ చైర్మన్‌గా ఎస్.ప్రసన్న ఎన్నికయ్యారని ఎంఈవో నరేష్ కుమార్ తెలిపారు.

కొల్లేరు సరస్సును సందర్శించండి

గవర్నర్‌ను ఆహ్వానించిన ఎమ్మెల్యే కామినేని



కైకలూరు, ఆగస్టు 8: కొల్లేరు సరస్సులోని పక్షుల కేంద్రాన్ని సందర్శించాలని రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానించినట్లు కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. అమరావతిలో గురువారం గవర్నర్‌ను కలసి ఆహ్వానించారు. అలాగే ఈ నెల 17న నెల్లూరు స్వర్ణభారతీ ట్రస్ట్ 23వ వార్షికోత్సవంలో కూడా పాల్గొనాలని ఆహ్వానించారు. స్వర్ణభారతీ ట్రస్ట్ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధనకర్ కూడా హాజరవుతారని తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 8: బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు వడిత్యా సోమశంకర్ నాయక్ అన్నారు. మండలంలోని ఒక గ్రామంలో అత్యాచారానికి గురైన బాలిక కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. బాలికపై జరిగిన అఘాయిత్యాన్ని ఖండిస్తున్నామన్నారు. బాధిత కుటుంబానికి రూ.ఐదు లక్షల పరిహారం అందించాలని కోరారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి జి.శ్రీను కుమార్, ఇన్‌చార్జి ఆర్డీవో భాస్కర్, తహసీల్దార్ సుబ్బారావు, సీడీపీవో సురాని, రూరల్ సీఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. బాలికపై పైశాచికత్వంకు వడిగట్టిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని గ్రామ జనసేన నాయకుడు సాయిపవన్ కమిషన్ సభ్యునికి వినతిపత్రం అందించి కోరారు.

మాజీ సీఎం భట్టాచార్యకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నూజివీడు టౌన్, ఆగస్టు 8: పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, కమ్యూనిస్టు యోధుడు బుద్ధదేవ్ భట్టాచార్యకు నూజివీడు సీపీఎం నాయకులు ఘన నివాళులర్పించారు. నూజివీడులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు మాట్లాడుతూ బెంగాల్‌లో 34 ఏళ్ల వామపక్ష పాలనలో కీలకభూమిక పోషించడంతో పాటు భట్టాచార్య 11 ఏళ్లు సీఎంగా పని చేశారన్నారు. పట్టణ కార్యదర్శి ఎస్ఆర్ హనుమాన్, సీపీఎం నాయకులు శోభనాద్రి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న సీఈవో నాగేశ్వరరావు

నూజివీడు టౌన్, ఆగస్టు 8: వ్యవసాయ సహకారి పరపతి సంఘం సభ్యుడు అకాల మృతి నేపథ్యంలో కృష్ణా జిల్లా సహకార కేంద్రం బ్యాంక్ ఆధ్వర్యంలో సభ్యుని కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. దుబ్బిరెడ్డి చిన్న సత్యనారాయణ ఇటీవల మృతి చెందాడు. అతని భార్య సరోజినికి నూజివీడు సహకార సంఘం తరుపున సంఘ సీఈవో నీలం నాగేశ్వరరావు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ల వితరణ


పాఠశాలకు కంప్యూటర్లను అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

కలిదిండి, ఆగస్టు 8 : మండలంలోని ఆవకూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు హైదరాబాద్ నార్డ్ ఆంగియా ఎడ్యుకేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు ఆరు కంప్యూటర్లను వితరణగా అందించారు. వీటితోపాటు ఇన్వెర్టర్, టేబుల్స్, చైర్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పరసా శివ ప్రసాద్, నున్న సునీల్ కుమార్, కె.ఆనంద్, వి.నరేంద్ర, ఎం.సురేష్, సర్పంచ్ ఎస్.నరసయ్య, ప్రధానోపాధ్యాయుడు మేకా రామారావు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన


ఘన వ్యర్థాల నిర్వాహణపై అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

నూజివీడు టౌన్, ఆగస్టు 8: తడి, పొడి చెత్తను ఎరువులుగా మార్చడం ద్వారా ఆదాయ వనరులను సృష్టించ వచ్చని నూజివీడు డీఎల్‌పీవో సుందరి అన్నారు. పాతరావిచర్యలలో డివిజన్ స్థాయిలో పారిశుధ్య నిర్వహణ, తడి, పొడి చెత్తల సేకరణ, ఘన వ్యర్థాల నుంచి ఎరువులు తయారీపై అవగాహన సదస్సులో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా జయప్రదం చేయాలి


ముదినేపల్లిలో మాట్లాడుతున్న కృష్ణారావు

ముదినేపల్లి, ఆగస్టు 8 : ప్రధాని మోదీ పిలుపు మేరకు గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో జాతీయ భావాన్ని పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు పిలుపునిచ్చారు. ముదినేపల్లిలో మండల పార్టీ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా హర్ ఘర్ తిరంగ కార్యక్రమం ద్వారా దేశభక్తిని చాటిచెప్పాలని కార్యకర్తలను కోరారు. మండల ప్రముఖ్ బండారు వెంకట రాజు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం స్ఫూర్తిని గ్రామీణుల్లో నింపాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకులు కె.నాగరాజు, రెడ్డి రాధిక, ఎం.ఫణి, ఎ.సాయి, ఎం.చిట్టిబాబు, కె.లక్ష్మీపతి రాజు, పి.నరసింహారావు, జె.రవికుమార్, బి.వెంకట నరసింహరావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

కైకలూరు, ఆగస్టు 8: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేసే విధంగా ప్రజల్లో స్ఫూర్తిని నింపాలని మండల బీజేపీ అధ్యక్షుడు కట్టా వీరరాఘవులు అన్నారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో గురువారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న ఆగస్టు 15ను పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేసే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. అలాగే ప్రజాసంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారికి లబ్ధి చేకూరేలా నేతలు కృషి చేయాలన్నారు. కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకట రాంప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారావు, పార్టీ నేతలు వి.వెంకటసుబ్బారావు, బి.బాలాజీ, బి.శ్యామలరాజు, వి.గోవిందచంద్రశేఖర్, ఎస్.చిన్నికృష్ణ, బి.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ళ స్థలాల పరిశీలన


ఇళ్ళ స్థలాలను పరిశీలిస్తున్న డీఈ రంగరావు

ముసునూరు, ఆగస్టు 8: కాట్రేనిపాడులో ఇళ్ళ స్థలాల సమస్యను పరిష్కారించాలని నూజివీడు మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు గురువారం హౌసింగ్ డీఈ బి.రంగారావు గురువారం పరిశీలించారు. జడ్పీ పాఠశాల ప్రాంగణంలో నివాస గృహాలు, టీడీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారు లకు కేటాయించిన స్థలాలను సైతం ఆయన పరిశీలించారు. పాఠశాల స్థలంలో నివాసముంటున్న వారితో కలిపి 127 మందికి పట్టాలు 2018లో ఇవ్వడం జరిగిందని, అయితే లబ్ధిదారులకు స్థలం పొజిషన్ చూపుడంలో రెవెన్యూ అధికారుల జాప్యం చేశారన్నారు. ఈలోగా 2019 ఎన్నికల కోడ్ రావడం, వైసీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని సీనియర్ టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ బొమ్మగంటి శ్యామలరావు డీఈకి వివరించారు. ఈ ఇళ్ళ స్థలాల సమస్యను గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన వివరించారు. ఈ స్థలాలు, లబ్ధిదారులకు మంజూరు చేసిన పట్టాలపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారు లకు అందజేస్తామని డీఈ రంగరావు తెలిపారు. అయితే ఇటీవల పెన్షన్‌ల పంపిణీకి వచ్చిన మంత్రి పార్థసారథి దృష్టికి ఇళ్ళ సమస్యను లబ్ధిదారులు, టీడీపీ నాయకులు తీసుకురాగా, హౌసింగ్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సమస్యను పరిష్కారించాలని ఆదేశించారు. అయితే ఈ ఇళ్ళ సమస్యలో రెవెన్యూ అధికారుల పాత్ర ఎక్కువగా ఉండగా వారు మాత్రం మంత్రి ఆదేశా లను సైతం పెడచెవున పెట్టి నిమ్మకునిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని లబ్ధిదారులు, నాయకులు మండిపడుతున్నారు.

శ్రీలక్ష్మమ్మ అంకమ్మ వార్ల గ్రామోత్సవం



చాట్రాయి, ఆగస్టు 8: మండలంలోని ఆరుగొలనుపేటలో శ్రీలక్ష్మమ్మ అంకమ్మ అమ్మవార్ల ఆలయ పునఃప్రతిష్ఠాత్సవంలో భాగంగా గురువారం ప్రతిష్ఠా విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ఉదయం వేద పండితులు గణపతి హోమం, జలాధివాసం, అధివాసాంగ హోమం నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం శాంతి హోమం, కుంభపూజ, ధాన్యాదివాసం, నీరాజనం, మంత్ర పుష్పం సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం



ముదినేపల్లి, ఆగస్టు 8 : ముదినేపల్లి మండలం ప్రొద్దువాకలో రూ.45 లక్షల దాతల విరాళాలతో నిర్మించిన శ్రీకోదండ రామాలయం దేవస్థాన కల్యాణ మండపాన్ని గురువారం ప్రారంభించారు. దేవస్థానం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు మండపంలో పూజలు నిర్వహించి, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా సీతారాముల శాంతి కళ్యాణం జరిపించి అన్నసమారాధన నిర్వహించారు. సుమారు నాలుగు వేల మంది స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆ గ్రామ ప్రముఖుడు నందూరి అన్నవరం విరాళంగా ఇచ్చిన 20 సెంట్ల స్థలంలో ఈ కల్యాణ మండపాన్ని నిర్మించారు.

రేపు కోదండరామాలయం ప్రతిష్ఠ




ఆగిరిపల్లి, ఆగస్టు 8: పోతవరప్పాడు పంచాయతీ పరిధిలో గోపాలపురంలో శనివారం కోదండరామాలయ ప్రతిష్ఠ జరుగుతుంది. హనుమత్ సీతాలక్ష్మణ సమేత కోదండరాముల వారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ, విమాన శిఖర ప్రతిష్ఠ, వైఖానస ఆగమోక్త ప్రకారం నిర్వహిస్తామని, అనంతరం సీతారామ కల్యాణం జరుగుతుందని ఈ కార్యక్రమం వైఖానస ఆగమ ప్రవర శ్రీమాన్ రొంపిచర్ల జనార్దన్ బట్టర్ గారిచే నిర్వహించబడునని ఆలయ కమిటీ వర్గాలు తెలిపారు.

శ్రీశ్యామలాంబకు శ్రావణమాస సారె



కైకలూరు, ఆగస్టు 8: శ్రావణమాసం మహోత్సవాల సందర్భంగా కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారికి సాయి బాబా సేవకులు శ్రావణ మాసం సారెను గురువారం మహిళలు అందజేశారు. ఆలయ అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ఆలయ ఈవో వీఎస్‌కే శేఖర్ వారికి ఆహ్వానం పలికారు. సాయిధ్యా నమందిర అధ్యక్షుడు కొనిజేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



ముసునూరు, ఆగస్టు 8: స్థానిక గురుకుల బాలికల పాఠశాలలో త్రీఫేజ్ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. బాలికలు బట్టలు ఆరవేసుకునే ప్రాంతంలో ఉన్న విద్యుత్ తీగల్లోకి చెట్లు కొమ్మలు అల్లుకుపోయాయి. ఈదురుగాలులతో కురుస్తున్న వర్షాలకు విద్యుత్ తీగల నుంచి చెట్లకు విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉన్నప్పటికి పాఠశాల యాజమాన్యం పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చెట్లకు విద్యుత్ వస్తే బాలికలకు ప్రాణాపాయం పొంచి ఉందని, తక్షణమే విద్యుత్ తీగల్లోకి అల్లుకుపోయిన చెట్లు కొమ్మలను తొలిగించాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆర్టీసీకి కొత్త బస్సులు


ఏలూరులో బస్సులకు పూజలు చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు


ఏలూరు క్రైం, ఆగస్టు 8 : రాష్ట్రంలో ఆర్టీసీకి 1400 కొత్త బస్సులు కొను గోలు చేశామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. ఏలూరు ఆర్టీసీ బస్సు డిపోలో గురువారం విజయవాడ జోన్-2కు సంబంధించిన 27 బస్సులను ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింత మనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తాను నెలలో 15 రోజుల పాటు ప్రత్యేక సమయం కేటాయించుకుని ఆర్టీసీ డిపోల్లో సమస్యలు పరిష్కార దిశగా పనిచేస్తున్నానన్నారు. ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డి, ఉప రవాణా కమిషనర్ శాంత కుమారి, ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి, ఏలూరు, తూర్పు గోదావరి, కాకినాడ, కృష్ణా జిల్లాల ప్రజా రవాణాధికారులు ఎన్‌వీఆర్ వరప్ర సాద్, షర్మిల, శ్రీనివాసరావు, వాణి, ఏలూరు డిపో మేనేజర్ వాణి, ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మిక సంఘా లు వినతి పత్రాలను మంత్రికి అందజేశారు. వాటన్నింటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి ప్రారంభించిన బస్సులు ఏలూరు డిపో నుంచి పాత బస్టాండ్ వరకూ వెళ్లి తిరిగి వచ్చాయి. వివిధ డిపోలకు కేటాయించిన బస్సులు ఆయా ప్రాంతాలకు వెళ్లిపోయాయి.

అప్లైడ్ మ్యాథమెటిక్స్‌లో డాక్టరేట్


పి.నాగరాజు

ముసునూరు, ఆగస్టు 8: మండలంలోని ముసునూరు గ్రామానికి చెందిన ప్రసుమర్తి నాగరాజు అప్లైడ్ మ్యాథమెటిక్స్‌లో డాక్టరేట్‌ను సాధించాడు. కడప జిల్లా యోగి వేమన విశ్వవిద్యాలయంలో అప్లైడ్ మ్యాథమెటిక్స్ సహ ఆచార్యులు డాక్టర్ ఎం.శ్రీధర్‌బాబు పర్యవేక్షణలో హీట్ ట్రాన్స్‌ఫర్ అనాలసిస్ ఆఫ్ ఎంహెచ్‌డీ నాన్ న్యూటోనియన్ ఫ్లూయిడ్ ఫ్లోస్ ఓవర్ ఆన్ ఇంక్లైండ్ ఎలాంగోటేడ్ సీట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు నాగరాజు తెలిపారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.ఈశ్వర రెడ్డి చేతులు మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నట్లు ఆయన తెలిపారు. డాక్టరేట్ పొందడంపై సర్పంచ్ కొండేటి విజయలక్ష్మీ యిర్మీయా, మండల పార్టీ అధ్యక్షులు దేవినేని బలరాం, తెలుగు యువత నియోజకవర్గ కార్యాదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్ (బాబి), ఉపసర్పంచ్ తోటశ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మెన్ నక్కా యోహాను తదితరులు నాగరాజును అభినందించారు.

కైకలూరు టౌన్ సీఐగా కృష్ణ



కైకలూరు, ఆగస్టు 8: కైకలూరు టౌన్ సీఐగా పలివెల కృష్ణ ఉద్యోగ బాధ్యతలను గురువారం రాత్రి చేపట్టారు. ఈయన విజయవాడ సిటీ పరిధి నుంచి బదిలీపై కైకలూరు వచ్చారు. గతంలో కైకలూరులో పనిచేసిన ఆకుల రఘు వీఆర్‌లోకి వెళ్లారు. సీఐ కృష్ణ మాట్లాడుతూ కైకలూరు మండలంలో గంజాయి విక్రయాలు లేకుండా చర్యలు చేపడతామన్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బదిలీ అయిన కార్యదర్శికి సన్మానం

ముదినేపల్లి, ఆగస్టు 8 : ముదినేపల్లి మండలం నుంచి గుడివాడ రూరల్ మండలం శేరీగొల్వేపల్లి పంచాయతీకి పదోన్నతిపై బదిలీ అయిన వడాలి పంచాయతీ కార్యదర్శి జి.రమేష్‌ను ఆ గ్రామ పంచాయతీ, సచివాలయాల సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. వడాలి గ్రామ సచివాలయ కార్యాలయంలో సర్పంచ్ మరీదు దుర్గా శ్రీతోపాటు సిబ్బంది సత్కరించి గ్రేడ్ -3 నుంచి గ్రేడ్ -2 కార్యదర్శిగా ప్రమోషన్ పొందినందుకు అభినందించారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు, ఎంవి.సుబ్బారావు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


లక్ష్మీభవాని

ముదినేపల్లి, ఆగస్టు 8 : ఇంటిలో చిన్న చిన్న మనస్పర్థలతో ఓ వివాహిత అలిగి వెళ్లిపోయిన సంఘటన ఇది. ముదినేపల్లికి చెందిన కోన మహాలక్ష్మి భవాని (33) అనే వివాహిత గురు వారం ఉదయం ఇంటి నుంచి అదృశ్యమైంది. ఆమె కోసం కుటుంబసభ్యులు వెదికినా ఫలితం లేకపోవడంతో గురువారం రాత్రి ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆమె తల్లి లక్ష్మీ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఎస్ఐ వెంకట్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.